నేటి కందం- నేటికి అందం

అయిదు విదేశమ్ములలో
నయిదు దినమ్ములను గడిపి యందరితోడన్
స్వయముగ మాటాడదలచి
పయనమ్మును మన ప్రధాని ప్రారంభించెన్ !!

(అయిదు దేశాలలో పర్యటించి స్వయముగా వాణిజ్య అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకోవడం కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ప్రారంభించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

ప్రజలపైన మరోసారి
పెట్రో ధరల మంట
సర్కారు యుద్ధబూచి
చంపుతున్న తంట.
రాష్ట్రాల్లో ఎన్నికల
రణరంగం ముగిసింది
దగాకోరు విధానాల
దండనింకా ఎగిసింది

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 17-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:219 పేజీలు:6 వెల: రూ.1/-

## పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే: సీఎం

హైదరాబాద్, మే 16: దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు. నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సీఎం విమర్శించారు.



ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప.. ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయిందని సీఎం అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని... యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందన్నారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందని... ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అంటూ విరుచుకుపడ్డారు.

ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని రేవంత్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం' అని పదే పదే ప్రకటించిందని గుర్తుచేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని... ఇది విశ్వాస ఘాతుకం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను అలసిపోనివ్వదు: ప్రధాని మోదీ..



న్యూఢిల్లీ, మే 16:భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశం లోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది.

భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి.

కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

## తైవాన్ కోసం చైనాతో యుద్ధం చేయలేం: ట్రంప్

న్యూ ఢిల్లీ, మే 16:తైవాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. తైవాన్ స్వాతంత్ర్యం కోసం చైనాతో పోరాడడం కుదరదని తేల్చి చెప్పేశారు. ఇటీవల చైనా పర్యటన ముగించుకుని తిరిగి అమెరికా చేరుకున్న ట్రంప్ ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. తైవాన్‌కు చైనా కేవలం 95 కిలో మీటర్ల దూరంలో ఉందని, అమెరికా 15 వేల కి.మీ. దూరంలో ఉందని వ్యాఖ్యానించారు.

'ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్ సంయమనం పాటించాలి. తైవాన్‌కు అమెరికా చాలా దూరంలో ఉంది. ఏదైనా జరిగితే మేం వేగంగా స్పందించడం కష్టమే. పైగా, చైనా చాలా శక్తిమంతమైన, పెద్ద దేశం. తైవాన్ కోసం చైనాతో యుద్ధం చేయాలనుకోవడం లేదు' అని ట్రంప్ తేల్చి చెప్పారు. అలాగే తైవాన్‌కు ఇవ్వాల్సిన 14 బిలియన్ డాలర్ల ఆయుధాల ప్యాకేజీపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ తెలిపారు.

తైవాన్‌ను తనలో పూర్తిగా విలీనం చేసుకోవాలని చైనా ఎప్పట్నుంచో ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నాలను అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్రంప్ కూడా చైనా తీరుపై విమర్శలు గుప్పించారు. అయితే తాజా పర్యటన తర్వాత ట్రంప్ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. కాగా, అమెరికా–చైనా సంబంధాల్లో తైవాన్ అత్యంత కీలక అంశమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తనతో అన్నారని ట్రంప్ వెల్లడించారు. 'మేము రాత్రంతా తైవాన్ గురించే మాట్లాడాం' అని తెలిపారు.

## రూ.182 కోట్ల క్యాప్టగాన్ పట్టివేత

న్యూ ఢిల్లీ, మే 16: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆపరేషన్ రేజ్‌పిల్ ద్వారా భారీ స్థాయిలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రూ.182 కోట్ల విలువైన క్యాప్టగాన్ డ్రగ్స్‌ను తొలిసారిగా అధికారులు పట్టుకున్నారని తెలిపారు. ఈ మాదకద్రవ్యాలను జిహాదీ డ్రగ్ గా పిలుస్తారని ఆయన పేర్కొన్నారు.

ఈ డ్రగ్స్‌ను పశ్చిమాసియాకు అక్రమంగా తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారని అమిత్ షా తెలిపారు. ఈ కేసులో ఓ విదేశీయుడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

ఎక్స్ వేదికగా స్పందించిన అమిత్ షా.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం డ్రగ్ ఫ్రీ ఇండియా లక్ష్యంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.

## ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20న మెడికల్ షాపుల బంద్..

### -తెలంగాణ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్




రాజన్న సిరిసిల్ల, మే 16: (నేటినిజం ప్రతినిధి): రోగులకు అవసరమైన ఔషధాలను విక్రయించే విధానంలో ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ ఫార్మసీ రద్దు చేయాలని నిరసనగా ఈ నెల 20 న దేశవ్యాప్తంగా మెడికల్ షాప్ లను ఒక రోజు బంద్ కు పిలుపు నిచ్చారు. తెలంగాణ కెమిస్ట్రీ అండ్ డ్రగ్జిస్ట్ అసోసియేషన్ కార్యవర్గం ఆధ్వర్యంలో బంద్ కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫార్మా రంగాన్ని ప్రభావితం చేస్తున్న పలు సమస్యలపై ఇప్పటికే విజ్ఞప్తులు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు.తెలంగాణ వార్తలు

ఈ ఫార్మసీ విక్రయాల ద్వారా ప్రజా ఆరోగ్యానికి ముప్పు ఉందని అన్నారు. ఆధునిక సాంకేతికతను అడ్డుపెట్టుకొని నకిలీ ప్రిస్క్రిప్షన్ ల ద్వారా ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఉందని హెచ్చరించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరిన స్పందించడం లేదని ఆరోపించారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవడమే కాకుండా, దేశంలో ఈ ఫార్మసీ విధానాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటుల అనైతిక డిస్కౌంట్ లను అరికట్టేందుకు నూతన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మందుల దుకాణాల యజమానుల సమస్యలపై ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా మెడికల్ షాప్ లను బంద్ చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి టీ రాజు, ట్రెజరర్ పీ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో జూన్ 25 నుంచి SIR ప్రారంభం: సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, మే 16: దేశ వ్యాప్తంగా SIR ప్రక్రియ ప్రారంభమైందని.. తెలంగాణలో జూన్ 25 నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు ప్రత్యేక సర్వే చేస్తారని అన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని.. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం–6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు. హెల్ప్‌లైన్ 1950తో పాటు Book a Call with BLO సదుపాయం కల్పించినట్లు చెప్పారు.

ఎన్యుమరేషన్ దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు. ఫారం ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చుతారని, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1కు ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందని.. 1987 – 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని చెప్పారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రుల పత్రాలు తప్పనిసరన్నారు.

2002లో రాష్ట్రంలో SIR చేశారని సీఈవో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నదే ఎస్ఐఆర్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 3.45 కోట్ల ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పొలిటికల్ పార్టీలకు కూడా SIR పై సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యుమరేషన్ తర్వాత డ్రాఫ్ట్ విడుదల చేస్తామని.. అందులో చూసుకొని ఓటర్లు మార్పు, చేర్పులు చేసుకోవచ్చని సీఈవో సుందర్శన్ రెడ్డి వెల్లడించారు.

జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే

జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ

అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల

## ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు.. అమెరికా ప్రకటన..

న్యూ ఢిల్లీ, మే 16:ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరో 45 రోజుల పాటు పొడిగించారు. వాషింగ్టన్‌లో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. ఇరు దేశాల మధ్య సమావేశానికి అమెరికా మధ్యవర్తిత్వం వహించింది. ఇరు దేశాల మధ్య ఏప్రిల్ 16న ప్రారంభమైన తాత్కాలిక కాల్పుల విరమణ ఈ ఆదివారంతో ముగియాల్సి ఉంది. దీంతో మరో 45 రోజుల పాటు ఈ ఒప్పందాన్ని పొడిగారు

ఈ కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్న సమయంలో శాశ్వత శాంతి ఒప్పందం కోసం మరిన్ని చర్చలు కొనసాగనున్నాయి. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య సరిహద్దు భద్రత, శాంతి, పరస్పర సార్వభౌమాధికారం కోసం చర్చలు కొనసాగుతాయని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి టామీ పిగాట్ తెలిపారు. మే 29న పెంటగాన్‌లో సైనిక స్థాయి చర్చలు, జూన్ 2–3 తేదీల్లో రాజకీయ స్థాయి చర్చలు జరగనున్నాయని వెల్లడించారు

కాగా, కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ దక్షిణ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి శనివారం సివిల్ డిఫెన్స్ కేంద్రంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఆరుగురు మరణించినట్టు సమాచారం. 22 మంది గాయపడినట్టు వార్తలు వస్తున్నాయి.

## మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో దారుణం.. వృద్ధుల దారుణ హత్య..

హైదరాబాద్, మే 16: మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు మహిళలను గుర్తుతెలియని వ్యక్తులు అతి దారుణంగా హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్యకు గురైన వారి మృతదేహాలను పరిశీలించారు. అయితే, మృతులను తాండూరులో అదృశ్యమైన ఇద్దరు వృద్ధులుగా పోలీసులు గుర్తించారు.

వీరి వయసు దాదాపు 60 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. బాధితులను వికారాబాద్ నుంచి తీసుకొచ్చి ఫామ్‌హౌస్‌లో హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఫైనాన్స్ డబ్బుల విషయంలోనే వీరి హత్య జరిగినట్లు భావిస్తున్నారు. డబ్బు ఇస్తామని పిలిచి అత్యంత దారుణంగా హత్య చేసినట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చిన ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది




న్యూఢిల్లీ, మే 16: ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఒవకేళ పాకిస్థాన్ ఉగ్రవాదులను పోషించి, వాళ్లను ఇండియా మీదకు ఉసిగొల్పితే, అప్పుడు ఆ దేశం ఈ భూమి మీద ఉండాలా లేదా అన్న అంశాన్ని వాళ్లే డిసైడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. చరిత్రలో ఆ దేశానికి స్థానం ఉండాలంటే ఉగ్రవాదులను పెంచి పోషించరాదన్నారు. మానేక్‌షా సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవేళ ఆపరేషన్ సింధూర్ చేపట్టడానికి దారి తీసిన పరిస్థితులు మళ్లీ వస్తే ఏం చేస్తారని ఆయన్ను ప్రశ్నించారు. జనరల్ ద్వివేది తన వ్యాఖ్యల్లో పాకిస్తాన్‌కు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇండియా నిలుస్తుందన్నారు. గత ఏడాది మే 7వ తేదీన పాక్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత పాక్ దాడులు చేసినా.. ఇండియా వాటిని తిప్పికొట్టింది. సుమారు 88 గంటల పాటు రెండు దేశాలు యుద్ధం కొనసాగించాయి. మే 10వ తేదీ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగింది.

## గోదావరిఖనిలో పెట్రోల్ డీజిల్ ధరల పెంపుపై సీపీఐ వినూత్న నిరసన..



కరీంనగర్, మే 15: కేంద్ర ప్రభుత్వం మళ్లీ మోసపూరితంగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లో కమ్యూనిస్టులు కదం తొక్కారు. ప్రధాన చౌరస్తా వద్ద సీపీఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో శనివారం ఆటో ట్రాలీ ని తాళ్ళతో లాగి కేంద్ర ప్రభుత్వం విధానాలపై నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపూరి సూర్య మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పొదుపు మంత్రం జపించిన కొన్ని రోజులకే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు.

ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజల మీద ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. ఈ మధ్యనే జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు చమురు, గ్యాస్ నిల్వలు దేశంలో అధికంగా ఉన్నాయని, అమెరికా ఇరాన్ యుద్ధం వల్ల మన దేశానికి ఎలాంటి నష్టం లేదని చెప్పి ఇపుడు కేంద్ర ప్రభుత్వం ధరలు ఎందుకు పెంచడం దేశ ప్రజలను మోసం చేసినట్లేనని ప్రశ్నించారు. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాటేటి శంకర్, తౌడుపునూరి రమేశ్ కుమార్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.లెనిన్, నాయకులు గొడిశల నరేశ్, కరీం, చంద్ర శేఖర్, సుధీర్, జగన్, ఆసాల నవీన్, కొమ్ము రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవజలం చలం
సాహిత్య స్మారకోపన్యాస సభ
19.5.2026 మంగళవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాలులో
చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది.
చలం పౌరాణిక సాహిత్యం – వస్తు రూపాలపై
ఎన్.వేణుగోపాల్, కుప్పిలి పద్మ ప్రసంగిస్తారు.
డా.ఏనుగు నరసింహారెడ్డి ఆప్తవాక్యం పలుకుతారు.
చలం పౌరాణిక నాటిక, నాటకాలలోని కొన్ని ముఖ్య భాగాలను –
భండారు విజయ, జ్వలిత, అరుణ ధూళిపాల, ఐనంపూడి శ్రీలక్ష్మి, గడ్డం సులోచన
వినిపిస్తారు.
ఈ సభకు మీరు తప్పక రావాలని మనవి.

– డా. నాళేశ్వరం శంకరం
కన్వీనర్, చలం భావన.

# టెలీకమ్యూనికేషన్, సమాచార రంగాలు లేని ప్రపంచం చీకటిమయం !

## (17 మే "ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం" సందర్భంగా)

17 మే 1865 రోజున పారిస్‌లో జరిగిన తొలి "అంతర్జాతీయ టెలిగ్రాఫ్ ఒప్పందం"పై సంతకం చేయడంతో "అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్ యూనియన్ (ఐటియూ)" ఆవిర్భవించడం జరిగిన విషయానికి గుర్తుగా 2005 నుంచి ప్రతి ఏటా 17 మే రోజున "ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం (వరల్డ్ టెలీకమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్‌మేషన్ సొసైటీ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. నాటి నుంచి నేటి వరకు శాస్త్రసాంకేతికరంగాలు కొత్త పుంతలు తొక్కుతూ, సమాచార విప్లవ సునామీకి కారణం అవుతున్నది టెలీకమ్యూనికేషన్స్, ఇన్ఫర్‌మేషన్ రంగాల్లో వచ్చిన సానుకూల మార్పులతో ప్రపంచ మానవాళి అనుసంధానం సుసాధ్యం అయ్యింది. స్మార్ట్‌ఫోన్లు, అంతర్జాలం, టెలీకమ్యూనికేషన్, సమాచార సాధన, ఉపగ్రహాలు, ఫైబర్ ఆప్టిక్స్, డేటా వ్యవస్థలు, రేడియో, టివీ, ప్రసార సాధనాలు లాంటి అనేక ఉపయుక్త ఉపకరణాలతో మానవాళి నేడు డిజిటల్ విప్లవం నుంచి ఏఐ యుగం వైపు అడుగులు వేస్తున్నది. నేడు భూమి కుగ్రామం అయ్యింది. దూరాలు, సరిహద్దుల అర్థాలు మారిపోయాయి.

### టెలీకమ్యూనికేషన్, సమాచార అనువర్తనాలు:

ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం వేదిక కేవలం సాంకేతిక వేడుక మాత్రమే కాదు. ఈ వేదికగా సమ్మిళితత్వం, స్థితిస్థాపకత, సుస్థిరతలకు సరైన సమాధానాలు దొరుకుతున్నాయి. ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు పడుతున్నాయి. సమాచార ప్రసారాల్ని ఒక జీవనాధారంగా, ఒక అభ్యసన సాధనంగా, నూతన అవకాశాలకు వారధిగా ప్రచారం చేయడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. ముందస్తు హెచ్చరికలు, అత్యవసర సమాచార ప్రసారాలు సుసాధ్యం చేయబడుతున్నవి. విపత్తులు, ఇతర సమయాల్లో ఆన్‌లైన్ తరగతులు, సమావేశాలు జరుగుటకు బాటలు పడ్డాయి. ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం వేదికగా డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడం, స్క్రీన్ సమయాన్ని సమతుల్యం చేయడం, ఆన్‌లైన్ భద్రతపై చర్చించడం, మానవ జీవితాల్లో అనువర్తనాలను ప్రచారం చేయడం లాంటి అంశాలు చర్చించడం జరుగుతుంది.

### ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం-2026 ఇతివృత్తం:

ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం-2026 ఇతివృత్తంగా "డిజిటల్ జీవనరేఖలు: అనుసంధానించిన ప్రపంచంలో స్థితిస్థాపకతను బలోపేతం చేయడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. మన జీవితాలు టెక్నాలజీ వలలో చిక్కుకొని పోయాయి. స్మార్ట్‌ఫోన్ లేనిదే క్షణం గడవడం లేదు. సామాజిక మాధ్యమాల్లో సంచరించడం సర్వసాధారణం అయి పోయింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు భారీ ఆస్తి ప్రాణ నష్టాలను అరికడుతున్నాయి. ఉపగ్రహాలు భూమి మీద ఉన్న మానవాళిని ఏకం చేస్తున్నాయి. ఈ రోజున ఇంటర్నెట్, నూతన టెక్నాలజీల వల్ల కలిగే సామాజిక ప్రయోజనాలపై అవగాహన కలిపించడం, డిజిటల్ అంతరాలను తగ్గించడం, టెలీకమ్యూనికేషన్-ఇన్ఫర్‌మేషన్ రంగాల అనువర్తనాలను వివరించడం విధిగా జరుగుతుంది.

1850 దశకంలో టెలిగ్రాఫ్‌ల వినియోగం ఊపందుకుంది. 1865 మే 17న యూరప్‌లోని 20 దేశాలు కలిసి అంతర్జాతీయ టెలిగ్రాఫ్ యూనియన్ ఏర్పాటు అయ్యింది. 1934లో దీని పేరును ఇంటర్నేషనల్ టెలీకమ్యూనికేషన్ యూనియన్‌గా మార్చడం జరిగింది. 1947 నుంచి ఐరాసకు అనుబంధ సంస్థగా పనిచేస్తోంది. 1969 నుంచి ఐటీయూ చొరవతో ఈ దినోత్సవం జరపడం ప్రారంభమైంది. 2005 నుండి ఐరాస నేతృత్వంలో ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. టెలీకమ్యూనికేషన్, ఇన్ఫర్‌మేషన్ లేని నేటి ప్రపంచం చీకటిమయం అవుతుంది. మన జీవనశైలిలో టెక్నాలజీ ఒక అవిభాజ్య అంగం అయిపోయింది. నేటి టెలీకమ్యూనికేషన్ విప్లవంతో పాటు ఇన్ఫర్‌మేషన్ సునామీని మానవాళి సుస్థిరాభివృద్ధికి వినియోగించుకోవాలని కోరుకుందాం, డిజిటల్ అంతరాలను తగ్గిద్దాం.



-మధుపాళీ
9949700037

# యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రధానమంత్రి పర్యటన

న్యూఢిల్లీ, మే 16: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అధికారిక పర్యటన చేపట్టారు. ఆయనకు యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ లాంఛనప్రాయంగా స్వాగతం పలికారు.

ఇద్దరు నాయకులు వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా యూఏఈపై జరిగిన దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందనీ, ఆ దేశ నాయకత్వానికీ, ప్రజలకూ సంఘీభావం తెలియజేస్తోందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ప్రాంతీయంగా శాశ్వత శాంతికీ, స్థిరత్వానికీ, ఇంధన, ఆహార భద్రతకు కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా సురక్షితమైన రవాణా, నిరాటంకమైన నౌకాయానానికి హామీ ఇవ్వాలనే భారత దేశ స్పష్టమైన వైఖరిని కూడా తెలియజేశారు.

ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలను నాయకులు సమీక్షించారు. అలాగే ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, ఫిన్‌టెక్, మౌలికవసతులు, విద్య, సంస్కృతి, ప్రజా సంబంధాలతో సహా వివిధ రంగాల్లో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతమవ్వడాన్ని స్వాగతించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని నూతన శిఖరాలకు చేర్చేలా భారత్-యూఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) సాధించిన విజయాన్ని వారు గుర్తించారు.

అభివృద్ధి చెందుతున్న ద్వైపాక్షిక ఇంధన భాగస్వామ్యాన్ని ఇరువురు నాయకులు ప్రశంసించారు. ముడి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ సరఫరాలతో సహా భారతదేశ ఇంధన భద్రతలో ముఖ్యమైన భాగస్వామిగా యూఏఈ కొనసాగుతుంది. సమగ్ర ఇంధన భాగస్వామ్యం కోసం నూతన కార్యక్రమాలను ప్రోత్సహించాలని నాయకులిద్దరూ అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్, అబుదుబాయ్ నేషనల్ ఆయిల్ సంస్థ మధ్య వ్యూహాత్మక సహకార ఒప్పందం ఖరారవ్వడాన్ని వారు స్వాగతించారు. భారత వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను 30 మిలియన్ బ్యారళ్లకు పెంచేందుకు, భారత్‌లో వ్యూహాత్మక గ్యాస్ రిజర్వులను ఏర్పాటు చేసే దిశగా కలసి పని చేసేందుకు ఉద్దేశించిన ఒప్పందమిది. దీర్ఘకాల ఎల్పీజీ సరఫరా కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్), అబుదుబాయ్ నేషనల్ ఆయిల్ కంపెనీ (ఏడీఎన్‌ఓసీ) మధ్య కుదిరిన ఒప్పందాన్ని కూడా వారు స్వాగతించారు.

యూఏఈ సంస్థలు భారత్‌లో 5 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు చేసిన ప్రకటనను ఇద్దరు నాయకులు స్వాగతించారు. వాటిలో ఎమిరేట్స్ న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ (ఈఎన్‌డీబీ) ఆర్‌బీఎల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో 3 బిలియన్ అమెరికన్ డాలర్లు,ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్మెంట్ ఫండ్ ఆఫ్ ఇండియా (ఎన్ఐఐఎఫ్) భాగస్వామ్యంతో భారత్‌లో చేపట్టే ప్రాధాన్య మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో నేషనల్ అబుదుబాయ్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) 1 బిలియన్ యూఎస్ డాలర్లు, సమ్మాన్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాలో ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ 1 బిలియన్ యూఎస్ డాలర్లు పెట్టుబడి పెడుతున్నాయి. ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తూనే.. భారతదేశ వృద్ధి ప్రయాణంలో యూఏఈ ప్రదర్శిస్తున్న దీర్ఘకాల అంకితభావాన్ని ఈ పెట్టుబడులు స్పష్టం చేస్తున్నాయి.

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో స్థిరమైన, బలమైన ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యం ప్రధానాంశం అని నాయకులు గుర్తించారు. గత పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సమగ్ర రక్షణ భాగస్వామ్య విధానంపై సంతకం చేయడాన్నివారు స్వాగతించారు. దీని పరిధిలో రక్షణ పారిశ్రామిక భాగస్వామ్యాన్ని, ఆవిష్కరణలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, సైనిక విన్యాసాలు, నౌకా వాణిజ్య భద్రత, సైబర్ భద్రత, సురక్షితమైన కమ్యూనికేషన్లు, సమాచారం వినిమయంలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు అంగీకరించారు.

ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేలా దిగువ పేర్కొన్న అదనపు ఒప్పందాలు నాయకుల సమక్షంలో ఖరారయ్యాయి.

భారత ప్రభుత్వం ప్రారంభించిన నౌకావాణిజ్య అభివృద్ధి నిధి పథకం పరిధిలో వాడినార్‌లో ఆఫ్‌షోర్ ఫ్యాబ్రికేషన్‌తో సహా నౌకా మరమ్మతుల క్లస్టర్ నిర్మాణంలో కొచ్చిన్ షిప్‌యార్డ్, దుబాయి సంస్థ డ్రైడాక్స్ వరల్డ్ మధ్య అవగాహన ఒప్పందం.

నౌకా మరమ్మతుల్లో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి కొచ్చిన్ షిప్ యార్డ్, డ్రైడాక్స్ వరల్డ్ దుబాయ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారీటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సీఈఎంఎస్) మధ్య త్రైపాక్షిక ఒప్పందం. ఇది నైపుణ్యాలున్న నౌకా శ్రామిక శక్తిని సమీకరించడానికి, శిక్షణ, ఉపాధి అందించడానికి అవసరమైన విధానాన్ని ఏర్పాటు చేస్తుంది. అలాగే భారతీయ నౌకా శ్రామిక శక్తి సామర్థ్యాలను మెరుగుపరుస్తుంది, అదే విధంగా నౌకానిర్మాణం, మరమ్మతుల్లో నిపుణులకు కేంద్రంగా భారతదేశాన్ని మారుస్తుంది.

భారత్‌కు చెందిన సీడాక్, యూఏఈకి చెందిన జీ-42 మధ్య 8 ఎక్సాఫ్లాప్ సూపర్ కంప్యూట్ క్లస్టర్ ఏర్పాటుకు నిబంధనల పత్రం.

మైత్రి (మాస్టర్ అప్లికేషన్ ఫర్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ రెగ్యులేటరీ ఇంటర్‌ఫేస్) ఉపయోగించి వర్చువల్ వాణిజ్య కారిడార్‌ను కార్యాచరణలోకి తీసుకురావడాన్ని నాయకులిద్దరూ స్వాగతించారు.

ఈ డిజిటల్ వ్యవస్థ ఇరు దేశాలకు చెందిన కస్టమ్స్, పోర్టు అధికారులను అనుసంధానించి, సరకు రవాణా సజావుగా సాగేలా చూస్తుంది. ఖర్చులను, రవాణా సమయాన్ని తగ్గించి మరింత సమర్థవంతమైన వాణిజ్యానికి వీలు కల్పిస్తుంది.

తనకు ఆత్మీయ స్వాగతం, ఆతిథ్యం అందించిన అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌కు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. త్వరలో భారత్‌ను సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు.

# కోచింగ్ రంగంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు, చట్ట వ్యతిరేక వాణిజ్య పద్ధతులపై దేశవ్యాప్తంగా చర్యలు చేపట్టిన సీసీపీఏ

న్యూఢిల్లీ, మే 16:తప్పుదోవ పట్టించే ప్రకటనలు, చట్ట వ్యతిరేకమైన వాణిజ్య పద్ధతులకు పాల్పడటం, వినియోగదారుల హక్కులను ఉల్లంఘించినందుకు వినియోగదారుల పరిరక్షణ చట్టం - 2019 ప్రకారం మోషన్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.10 లక్షలు, సీకర్‌లోని కెరీర్ లైన్ కోచింగ్ (సీఎల్‌సీ)కు రూ. 5 లక్షల జరిమానా విధిస్తూ.. కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) తుది ఉత్తర్వులను జారీ చేసింది.

వినియోగదారులను ఒకే వర్గంగా పరిగణించి వారి హక్కులను పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి, వినియోగదారుల పరిరక్షణ చట్టం -2019 లోని నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అసత్య లేదా తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) ప్రధాన కమిషనర్ శ్రీమతి నిధి ఖరే, కమిషనర్ శ్రీ అనుపమ్ మిశ్రా మోషన్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్, సీకర్‌లోని కెరీర్ లైన్ కోచింగ్ (సీఎల్‌సీ) సంస్థలకు ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సంస్థలు ఐఐటీ-జేఈఈ, నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల పేర్లు, ఫోటోలు, వారి విజయాలను ఉపయోగించుకుంటూ, వారు ఎంచుకున్న నిర్దేశిత కోర్సులకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను దాచిపెడుతూ ప్రకటనలిస్తున్నాయని సీసీపీఏ గుర్తించింది.

ఈ సంస్థ తన అధికారిక వెబ్‌సైటు, యూట్యూబ్ ఛానల్, ఇన్స్టాగ్రామ్ ఖాతాల్లోనూ, వార్తాపత్రికల్లో తప్పుదోవ పట్టించే విధంగా ఇచ్చిన ప్రకటనలను సీసీపీఏ సుమోటోగా తీసుకుంది. వాటిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల పేర్లు, ఫోటోలను ప్రచురించడంతో పాటు "ఫుల్ టైమ్ క్లాస్ రూం ప్రోగ్రాం", "రెసిడెన్షియల్ ప్రోగ్రాం", "నర్చర్ బ్యాచ్", "ఎంథూస్ బ్యాచ్", "డ్రాపర్/లీడర్ బ్యాచ్" లాంటి చెల్లింపులు చేయాల్సిన కార్యక్రమాలను ప్రచారం చేయడాన్ని సీసీపీఏ గుర్తించింది. అదే సమయంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు దేనిని ఎంచుకున్నారనే వివరాలను దాచి ఉంచిందని కూడా గమనించింది.

ఈ ప్రకటనల్లో కనిపించిన విద్యార్థుల్లో అధిక శాతం మంది ఈ సంస్థ ఇచ్చిన "ఐ-ఏకలవ్య (ఆన్‌లైన్)" కోర్సులో చేరారని డైరెక్టర్ జనరల్ (ఇన్వెస్టిగేషన్) నిర్వహించిన దర్యాప్తులో తేలింది. ఐ-ఏకలవ్య.. జేఈఈ, నీట్ ఆశావహుల కోసం ఉద్దేశించిన ప్రీమియర్ ర్యాంకర్ల బ్యాచ్ అనీ, పరీక్ష, ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థులకు దానిని ఆఫ్‌లైన్, ఆన్లైన్ విధానాలు రెండింటిలోనూ ఉచితంగానే అందిస్తుందనీ సీసీపీఏ గుర్తించింది. ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎంపిక చేసుకున్న కోర్సుకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని వెల్లడించడంలో ఈ ప్రకటనలు విఫలమయ్యాయి.

అంతేకాకుండా.. పరీక్షల అనంతరం కోర్సులో చేరిన కొంతమంది విద్యార్థుల పేర్లను, ఫోటోలను ఈ సంస్థ ఉపయోగించుకుని, వారు సాధించిన విజయాన్ని తమ సంస్థకు అన్వయించుకుందని గుర్తించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు/సంరక్షకుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండానే విద్యార్థుల పేర్లను, ఫోటోలను దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో తేలింది.

అనేక అవకాశాలు, ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఈ ప్రకటనల్లో చేసిన క్లెయిములకు సంబంధించిన పత్రాలను సాక్ష్యాలుగా సమర్పించడంలో ఈ సంస్థ విఫలమైందని సీసీపీఏ గుర్తించింది. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఎంపిక చేసుకున్న కోర్సులకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని దాచిపెట్టడం వినియోగదారుల పరిరక్షణ చట్టం ? 2019 లోని సెక్షన్ 2(28) ప్రకారం తప్పుదారి పట్టించే ప్రకటనగా, సెక్షన్ 2(47) ప్రకారం అక్రమ వాణిజ్య పద్ధతిగా పరిగణించవచ్చని సీసీపీఏ నిర్ధారించింది.

సీకర్‌లోని కెరీర్ లైన్ కోచింగ్ (సీఎల్‌సీ) సంస్థ తన అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వార్తాపత్రికల్లో తప్పుదోవ పట్టించేలా ప్రచురించిన ప్రకటనలను సీసీపీఏ సుమోటోగా స్వీకరించింది. విజయం సాధించిన అభ్యర్థులను ప్రముఖంగా చూపిస్తూ.. వివిధ తరగతులకు సంబంధించిన కార్యక్రమాలను ప్రచారం చేస్తోందని, అభ్యర్థులు ఎంచుకున్న కోర్సులకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని దాచి పెట్టిందని సీసీపీఏ గుర్తించింది.

# సీఎంపీడీఐఎల్ పనితీరును సమీక్షించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయమంత్రి

న్యూ ఢిల్లీ, మే 16:కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబే 14.05.2026న రాంచీలో సీఎంపీడీఐ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎంపీడీఐ సీఎండీ శ్రీ చౌదరి శివరాజ్ సింగ్, సీసీఎల్ సీఎండీ శ్రీ నీలేందు కుమార్ సింగ్, ఎంఈసీఎల్ సీఎండీ శ్రీ ఐ.డీ. నారాయణ్‌తో పాటు సీఎంపీడీఐ టెక్నికల్ డైరెక్టర్లు, సీఎంపీడీఐ, సీసీఎల్, ఎంఈసీఎల్ సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



అన్వేషణ, నివేదిక తయారీ, మూలధన వ్యయం, పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులు, సీఎస్ఆర్ కార్యక్రమాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టుల వంటి వివిధ రంగాల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించి సీఎంపీడీఐ పనితీరుపై ఈ సమావేశంలో చర్చించారు. 2026-27 సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరించారు.

సీఎంపీడీఐ పనితీరును కేంద్రమంత్రి ప్రశంసించారు. భవిష్యత్తులో దేశ ఇంధన, ఆర్థిక భద్రతకు అత్యంత కీలకమైన క్లీన్ కోల్ టెక్నాలజీ, అరుదైన ఖనిజాల అన్వేషణ ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎల్ సీఎండీ శ్రీ నిలేందు కుమార్ సింగ్, ఎంఈసీఎల్ సీఎండీ శ్రీ ఐ.డీ. నారాయణ్ పాల్గొన్నారు. అధిక సంఖ్యలో బిడ్డర్లు పాల్గొనటం వల్ల ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా చూసేందుకు, సేకరణ ప్రక్రియలను సులభతరం చేసేందుకు.. పారదర్శకతను పెంచాలని, మార్కెట్ విస్తరణను మెరుగుపరచాలని సీఎంపీడీఐ యాజమాన్యానికి సూచించారు.

గనుల తవ్వకం పూర్తయిన తర్వాత ఆ ప్రాంతాలను స్థానిక ప్రజలకు సామాజికంగా-ఆర్థికంగా ఉపయోగపడేలా మార్చాలని మంత్రి చెప్పారు. "ఒక జిల్లా-ఒక ఉత్పత్తి" (ఓడీఓపీ) పథకంలో భాగంగా ఈ ప్రాంతాల్లో తామర గింజల (మఖానా) సాగు, చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. మూతపడిన గనులను వ్యవసాయ, మత్స్య సంపద కేంద్రాలుగా మార్చటం ద్వారా స్థానిక ప్రజలకు స్థిరమైన ఉపాధిని కల్పించటమే ఈ దూరదృష్టి విధాన లక్ష్యం.

కేంద్రమంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబే సమక్షంలో బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణలో పరస్పర సహకారానికి సీఎంపీడీఐఎల్ (సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్), ఎంఈసీఎల్ (మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్) సంస్థల మధ్య 14.05.2026న అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలో నూతన గనుల ఏర్పాటు వేగవంతం అవటమే కాక, ఖనిజ నిల్వల లభ్యత మరింత పెరుగుతుంది.

భారతదేశ ఖనిజ సంపద వృద్ధికి తోడ్పడుతూ, ఖనిజ రంగంలో స్వావలంబనను ప్రోత్సహిస్తూ.. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు ఈ కార్యక్రమం కీలక ముందడుగా నిలుస్తుంది.

# స్వచ్ఛతకు తిరుపతి పోలీసులు శ్రీకారం

### -జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు

తిరుపతి, మే 16: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ సర్వేక్షణ్" కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని పోలీస్ స్టేషన్ ఆవరణలు, పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు.

పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛత ప్రాముఖ్యతను వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని ఎస్పీ తెలిపారు.

ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, కార్యాలయం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. "స్వచ్ఛ ఆంధ్ర" లక్ష్య సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### -అవనిగడ్డలో చెత్తాచెదారాన్ని తొలగించిన కలెక్టర్



అమరావతి, మే 16: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ ప్రజలకు సూచించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం అవనిగడ్డలోని ఎల్.ఐ.సి సమీపంలో చెత్త చెదారాన్ని, ఇతర వ్యర్థాలను జిల్లా కలెక్టర్ స్వయంగా తొలగించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

స్వచ్ఛ కృష్ణాగా జిల్లాను తీర్చిదిద్దేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని అందించాలని కోరారు. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు.

అపరిశుభ్ర వాతావరణం కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. సంపూర్ణ ఆరోగ్య సంరక్షణపై ప్రజలు దృష్టి సారించాలని తెలిపారు.

గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతిరోజు తడి, పొడి చెత్తను వేరువేరుగా పంచాయితీ రిక్షాకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో అరుణ, జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి, ఎంపీపీ తుంగల సుమతి, ఎంపీడీవో మరియదేవి, తహసీల్దార్ అవనిగడ్డ శ్రీనివాసరావు, మండల స్థాయి వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

అమరావతి, మే 16:ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రతి అర్జీకి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు.

సింగ్ నగర్ సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ డే ద్వారా స్వయంగా బొండా ఉమామహేశ్వరరావు సమస్యల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఫార్మా మాక్‌టెక్ - ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' కోసం హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహించిన ఈఈపీసీ భారత్




న్యూఢిల్లీ, మే 16:'ఫార్మా మాక్‌టెక్ - ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' రెండో విడతకు సన్నాహకంగా దేశంలోని అగ్రగామి ఇంజనీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక సంస్థ అయిన ఈఈపీసీ భారత్ ఈ రోజు హైదరాబాద్‌లో రోడ్‌షోను నిర్వహించింది. ఫార్మా యంత్రాలు, ల్యాబ్ పరికరాల రంగంలో భారతదేశాన్ని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడంపై ఈ కార్యక్రమంలో చర్చాగోష్ఠులు చేపట్టారు.

సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో రెండో విడత 'ఫార్మా మాక్‌టెక్ - ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' జరగనుంది. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద ఫార్మా ప్రదర్శనలలో ఒకటిగా పేరుగాంచిన ఐపెక్స్‌తో కలిపి ఈ ఎక్స్‌పోను నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలు ఫార్మా, వైద్యారోగ్య ఇంజనీరింగ్ రంగానికి సంబంధించిన పూర్తి విలువ గొలుసును ఒకే వేదికపైకి తీసుకురానున్నాయి.

ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ ప్రాంతీయ సంయుక్త డీజీఎఫ్టీ అక్షయ్ ఎస్.సి... ఈ రంగాల వ్యూహాత్మక మద్దతును ప్రముఖంగా ప్రస్తావిస్తూ, భారతదేశ ఫార్మాస్యూటికల్ (ఔషధ) రంగం భవిష్యత్తు వృద్ధి, దేశీయ ఉక్కు, ఉత్పాదక రంగాల బలంపైనే గణనీయంగా ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్పాదకులు ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మారవలసిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. అలాగే ప్రత్యేక యంత్రాల దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆయన పరిశ్రమ రంగాన్ని కోరారు.

ఈఈపీసీ భారత్ కార్యనిర్వాహక డైరెక్టర్- కార్యదర్శి అధిప్ మిత్ర స్వాగత ప్రసంగం చేశారు. అమెరికాకు చేసే ఫార్మా ఎగుమతులను 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దీనికోసం తయారీదారులు, ఎగుమతిదారులు విలువ ఆధారిత, ఆవిష్కరణలతో కూడిన నైపుణ్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఫార్మా 4.0, ఆటోమేషన్, ప్రిసిషన్ డ్రగ్ డెలివరీ, నాణ్యమైన ల్యాబ్ పరికరాల వంటి తాజా ఆవిష్కరణల గురించి తెలుసుకునేందుకు 'ఫార్మా మాక్‌టెక్ - ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' ఒక విశిష్టమైన అవకాశాన్ని కల్పిస్తుందని ఆయన వివరించారు.

ఈ రోడ్‌షోలో పరిశ్రమల నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. హాజరైన వారికి పరస్పర చర్చలు, నెట్‌వర్కింగ్ కోసం ఈ కార్యక్రమం మంచి అవకాశాన్ని కల్పించింది.

ఈ రోడ్‌షోలో జాయింట్ డీజీఎఫ్‌టీ (ఆర్‌ఏ హైదరాబాద్) శ్రీ అక్షయ్ ఎస్.సీ, సీడీఎస్‌సీఓ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ కే. నరేంద్రన్, హైదరాబాద్ ఈసీజీసీ సీనియర్ మేనేజర్ సురేష్ బాబు అతిథులుగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో రంగానికి సంబంధించిన నిపుణులు అభిప్రాయాలను పంచుకున్నారు. ఫార్మా యంత్రాలు, ల్యాబ్ పరికరాల రంగంలో వస్తున్న కొత్త అవకాశాల గురించి వారు చర్చించారు. ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ప్రభుత్వ చర్యలు, సుస్థిరత, డిజిటల్ పరివర్తన, అత్యాధునిక తయారీ పద్ధతుల వంటి అంశాలపై ఈ చర్చలు సాగాయి.

ప్రపంచ దేశాల వ్యాపార ప్రతినిధుల బృందాలతో నిర్వహించే వరుస సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, ముఖాముఖి కొనుగోలుదారు-విక్రేత సమావేశాలు తాజా పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి, అంతర్జాతీయ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని అధిప్ మిత్ర తెలిపారు.

నేడు జరిగిన ఈ రోడ్‌షోలో భాగంగా 'స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, నెక్స్ట్-జెన్ లాబొరేటరీ పరిష్కారాల ద్వారా ఫార్మా - బయోటెక్ పరిశ్రమల పరివర్తన' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. 'ఫార్మా మాక్‌టెక్ - ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' గురించి ఈఈపీసీ భారత్ ప్రాంతీయ డైరెక్టర్ రాకేష్ సూరజ్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

పాల్గొన్న వక్తలు తమ అభిప్రాయాలు పంచుకుంటూ, ఫార్మా మెషినరీ, ల్యాబ్ ఎక్విప్‌మెంట్ రంగాలలో వస్తున్న సరికొత్త అవకాశాల గురించి చర్చించారు. ఈ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ప్రభుత్వ కార్యక్రమాలు, స్థిరత్వం, డిజిటల్ పరివర్తన నుండి అత్యాధునిక ఉత్పాదక పద్ధతుల వరకు వివిధ అంశాలు ఈ చర్చల్లో చోటుచేసుకున్నాయి.

ప్రపంచ వ్యాక్సిన్ సరఫరాలో దాదాపు మూడో వంతు, భారతదేశ మొత్తం బల్క్ డ్రగ్ ఉత్పత్తిలో సుమారు 40 శాతం వాటాను హైదరాబాద్ కలిగి ఉన్నందున ఇక్కడ రోడ్‌షో నిర్వహించడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి వంటి ఇంజనీరింగ్ క్లస్టర్లు ఈ రంగంలో కీలకమైన సరఫరా గొలుసులో భాగంగా ఉన్నాయి.

భారతదేశ దేశీయ ఫార్మా యంత్రాల రంగం ప్రస్తుతం 8-10 శాతం వార్షిక వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. అయితే అత్యున్నత సాంకేతికతతో కూడిన పరికరాల విభాగంలో ఇప్పటికీ దిగుమతులపైనే ఎక్కువ ఆధారపడుతోంది. ఫార్మా, మెడికల్ ల్యాబ్‌లలో ఉపయోగించే యంత్రాలతో సహా ల్యాబ్ పరికరాలు భారతీయ ఫార్మా యంత్రాల పరిశ్రమలో ఒక ముఖ్యమైన విభాగంగా ఉన్నాయి.

గత ఐదేళ్లలో ఫార్మా యంత్రాల ఎగుమతులు 15.3 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేయగా దిగుమతులు 10.5 శాతం వృద్ధి చెందాయి. ప్రస్తుతం ఈ రంగంలో భారత్ వాణిజ్య లోటును కలిగి ఉంది.

గత ఐదేళ్లలో ల్యాబ్ పరికరాల ఎగుమతులు 8.3 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేయగా దిగుమతులు 7 శాతం వృద్ధి చెందాయి. ల్యాబ్ పరికరాల విభాగంలో కూడా భారత్ వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది.

ధన్యవాదాలు సమర్పించిన ఈఈపీసీ భారత్ ఉప ప్రాంతీయ చైర్మన్ అరుణ్ శుక్లా... ఉత్సాహంగా పాల్గొన్న పరిశ్రమ ప్రతినిధులు, భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు.

# పారదర్శకత, పాలన, కార్యాచరణ సంస్కరణలపై ప్రధానంగా దృష్టి

న్యూఢిల్లీ, మే 16:భారత్ అధ్యక్షతన ముంబయిలో నిర్వహించిన కింబర్లీ ప్రాసెస్ మధ్యంతర వార్షిక సమావేశం -2026 విజయవంతంగా ముగిసింది. సహజ వజ్రాల రంగం భవిష్యత్తుపై చర్చించడం కోసం నాలుగు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో కింబర్లీ ప్రాసెస్ సభ్యదేశాల ప్రతినిధులు, పరిశీలకులు, పరిశ్రమ వర్గాలు, పౌర సమాజ సంస్థలు పాల్గొన్నాయి.

ఈ సమావేశం విజయవంతంగా ముగియడం పట్ల కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ హర్షం వ్యక్తం చేశారు. వజ్రాల కటింగ్, వాటిని మెరుగుపెట్టడంలో భారత్ అగ్రగామిగా ఉందన్నారు. విశ్వసనీయత, బాధ్యత, ఉమ్మడి శ్రేయస్సుకు చిహ్నంగా సహజ వజ్రాలను నిలపడంలో కింబర్లీ ప్రాసెస్ పోషిస్తున్న కీలక పాత్రను భారత్ గుర్తించిందన్నారు. భారత్ అధ్యక్షతన 3సీలు.. అంటే విశ్వసనీయత (క్రెడిబిలిటీ), నిబంధనల అమలు (కాంప్లయన్స్), వినియోగదారుల నమ్మకం (కన్స్యూమర్ కాన్ఫిడెన్స్) అనే అంశాలను ముందుకు తీసుకెళ్లడానికి దేశం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచ మార్కెట్‌లో కింబర్లీ ప్రాసెస్ ప్రాధాన్యాన్ని మరింత బలోపేతం చేసేలా సభ్యదేశాలన్నీ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉత్పత్తి చేసే దేశాల నుంచి ప్రాసెసింగ్, వాటిని వినియోగించే దేశాల వరకు కోట్లాది ప్రజల జీవనోపాధిని సహజ వజ్రాల రంగం కాపాడుతోందని మంత్రి వివరించారు. పరిశ్రమల ఆకాంక్షలకు మరియు వినియోగదారుల అంచనాలకు అనుగుణంగా.. దృఢమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన కింబర్లీ ప్రాసెస్ కోసం భారత్ ఎప్పుడూ ముందుండి కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు.

విశ్వసనీయత (క్రెడిబిలిటీ), నిబంధనల అమలు (కాంప్లయన్స్), వినియోగదారుల నమ్మకం (కన్స్యూమర్ కాన్ఫిడెన్స్) అనే '3సీ'ల ఇతివృత్తంతో.. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ వార్షిక మధ్యంతర సమావేశం.. కింబర్లీ ప్రాసెస్ వ్యవస్థలో నమ్మకాన్ని, పారదర్శకతను, సహకారాన్ని పెంపొందించడంపై సుదీర్ఘంగా చర్చించింది.

ఈ సమావేశ సందర్భంగా.. పర్యవేక్షణ, సాంకేతిక ప్రక్రియలు, పాలన, గణాంకాలు, కళా ఉత్పత్తుల వంటి అంశాలపై వివిధ కార్యాచరణ బృందాలు, కమిటీలు వివరణాత్మకంగా చర్చించాయి. సహజ వజ్రాల రంగానికి సంబంధించి ప్రతీ దశలోనూ పారదర్శకతను పెంచడం, కార్యాచరణ యంత్రాంగాలను మెరుగుపరచడం, నమ్మకాన్ని పునరుద్ఘాటించడంపై ప్రధానంగా దృష్టి సారించాయి.

విశ్వసనీయంగా, సందర్భోచితంగా, ప్రపంచ వజ్రాల వాణిజ్యమూ వినియోగదారుల అంచనాలకు అనుగుణంగా కింబర్లీ ప్రాసెస్‌ను నిలపడంలో భాగస్వామ్య, పరిశీలక దేశాల సమష్టి నిబద్ధతకు.. ముంబయి సమావేశంలో సాధించిన పురోగతి నిదర్శనమని కింబర్లీ ప్రాసెస్ చైర్మన్ (2026) శ్రీ సుచింద్ర మిశ్రా పేర్కొన్నారు. సహజ వజ్రాల వాణిజ్యానికి నమ్మకమే పునాది అని ఆయన స్పష్టం చేశారు. వజ్రాల రంగానికి సంబంధించి ప్రతీ దశలోనూ బాధ్యతాయుతమైన సేకరణ, పారదర్శకత, నమ్మకాన్ని పెంపొందించడంలో కింబర్లీ ప్రాసెస్ మూలాధారంగా నిలుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

సహజ వజ్రాల ఉత్పత్తి దేశాలు, అక్కడి వర్గాల్లో అమలు చేస్తున్న బాధ్యతాయుతమైన సేకరణ పద్ధతులు, అభివృద్ధి ఫలితాలు, జీవనోపాధికి దాని సహకారం వంటి సానుకూల అంశాలను మరింత సమర్థంగా తుది వినియోగదారులకు చేరవేయడం కోసం సమాచారం, ప్రచార కార్యక్రమాలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను కూడా సమావేశం ప్రముఖంగా పేర్కొన్నది.

ఈ ఏడాది చివర్లో న్యూఢిల్లీలో జరగనున్న కేపీ సర్వసభ్య సమావేశానికి ఈ సమావేశ చర్చలు దిశానిర్దేశం చేయనున్నాయి. 2026లో భారత్ అధ్యక్షతన కొనసాగే ఈ ప్రక్రియలో.. విశ్వసనీయత, నిబంధనల అమలు, వినియోగదారుల నమ్మకం అన్న అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

ఈ సమావేశంలో కింబర్లీ ప్రాసెస్ సభ్యదేశాల ప్రతినిధులు, వరల్డ్ డైమండ్ కౌన్సిల్, పౌర సమాజ సంస్థల సభ్యులు, పారిశ్రామిక సంస్థలు, ఇతర భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వాలు, పరిశ్రమ, పౌర సమాజం మూడింటి కలయికతో కూడిన కింబర్లీ ప్రాసెస్‌లో ప్రత్యేకంగా నిలిచే త్రైపాక్షిక నిర్మాణం, ఏకాభిప్రాయ విధానం దాని ప్రధాన బలాలుగా ఉన్నాయని చైర్మన్ వ్యాఖ్యానించారు.

2000 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఆమోదించిన 55/56 తీర్మానం కింద కింబర్లీ ప్రాసెస్ ధ్రువీకరణ పథకాన్ని ప్రారంభించారు. ఘర్షణ ప్రాంతాల నుంచి వచ్చే అక్రమ వజ్రాలను అధికారిక వాణిజ్యంలోకి ప్రవేశించకుండా నిరోధించడం, సహజ వజ్రాల సరఫరా వ్యవస్థలో బాధ్యతాయుత సేకరణ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ అంతర్జాతీయ కార్యక్రమం పనిచేస్తోంది.

వజ్రాల కటింగ్, వాటిని మెరుగుపెట్టడంలో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఉన్న భారత్.. కింబర్లీ ప్రాసెస్ లక్ష్యాలకు కట్టుబడి ఉంటానని పునరుద్ఘాటించింది. అలాగే సహజ వజ్రాల రంగంలో పారదర్శకత, సుస్థిరత, బాధ్యతాయుత పద్ధతులను ప్రోత్సహించడంలో ముందుంటామని స్పష్టం చేసింది.

# జలవనరుల ఆక్రమణలకు చెక్..!

## సమన్వయ శాఖల అధికారులకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలు



అమరావతి, మే 16: జల వనరుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కాలువలు, చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులపై ఆక్రమణలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని.. అత్యంత పారదర్శకతతో నిర్వహించే క్షేత్రస్థాయి తనిఖీలు, పరిశీలనల నివేదికలు సమగ్ర కార్యాచరణకు కీలకమని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు.

జల వనరుల సంరక్షణ, ఆక్రమణల గుర్తింపు, తొలగింపునకు సంబంధించి కలెక్టర్ లక్ష్మీశ.. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎంతో కలిసి పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, జల వనరులు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులతో కలిసి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సమావేశంలో జల వనరుల సంరక్షణకు సంబంధించి గౌరవ ఏపీ హైకోర్టులో 2024లో దాఖలైన ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యంపైనా చర్చించారు. జలవనరుల ఆక్రమణల వల్ల పర్యావరణ సమస్యలతో పాటు వరద ముప్పులు, భూగర్భ జలాల తగ్గుదలకు దారితీస్తాయని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాలువలు, డ్రైన్లు, చెరువులు తదితర జలవనరుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రత్యేక కమిటీ సంయుక్త తనిఖీలు, సర్వేలకు సంబంధించిన నివేదికలు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రూపొందించాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరక్కుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమావేశంలో డీసీపీ కేజీవీ సరిత, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో పి.లావణ్యకుమారి, ఇరిగేషన్ స్పెషల్ డివిజన్ ఈఈ బి.ఆంజనేయ ప్రసాద్, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మనం ఆదా చేసే ప్రతి చుక్క ఇంధనంతో భారత భవితకు, గౌరవానికి భద్రత: శ్రీ టోకన్ సాహు

న్యూ ఢిల్లీ, మే 16:ఇంధన పొదుపు కోసం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు మద్దతుగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ టోకన్ సాహు ఈ రోజు తన నివాసం నుంచి సంకల్ప్ భవన్ వరకు 3 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించారు. తద్వారా సుస్థిర పట్టణ రవాణా, పర్యావరణ బాధ్యత, దేశ సేవ గురించి పౌరులకు బలమైన సందేశాన్ని అందించారు.

ఈ సందర్భంగా శ్రీ సాహు మాట్లాడుతూ... వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ తరగతులు, వీడియో అనుసంధానం ద్వారా సమావేశాలు, పెట్రోల్-డీజిల్ వినియోగాన్ని తగ్గించడం వంటి కోవిడ్-కాలపు పద్ధతులను పునరుద్ధరించాలని ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తిని శ్రీ సాహు గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో అది అత్యంత సముచితం, సందర్భోచితమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు దేశ ప్రయోజనాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. దీనిని దేశ సేవగా భావిస్తూ, ఈ సామూహిక కృషిలో పాలుపంచుకోవడం బాధ్యత గల ప్రతీ పౌరుడి విధి అని శ్రీ టోకన్ సాహు ఉద్ఘాటించారు.

ఇంధన పొదుపు కేవలం ఆర్థిక అవసరం మాత్రమే కాదనీ... పర్యావరణం పట్ల మన బాధ్యత, క్లిష్ట సమయాల్లో దేశాన్ని బలోపేతం చేయగల సామూహిక జాతీయ కర్తవ్యమని శ్రీ సాహు స్పష్టం చేశారు. "మనం ఆదా చేసే ప్రతి లీటరు ఇంధనం దేశ విస్తృత ప్రయోజనాలకు దోహదపడుతుందన్నారు. దేశం సమష్టిగా సుస్థిరత, స్వయం-సమృద్ధి దిశగా ముందుకుసాగుతున్న తరుణంలో చిన్నవైనప్పటికీ... అవగాహనతో కూడిన జీవనశైలి మార్పుల ద్వారా పౌరులు అర్థవంతమైన సహకారం అందించగలరు" అని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని ఆదర్శంగా తీసుకుని కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు ఇప్పటికే తమ కాన్వాయ్‌లను 50 శాతం తగ్గించడం ప్రారంభించారని శ్రీ సాహు పేర్కొన్నారు. వ్యక్తిగత ఆచరణ ద్వారా నాయకత్వం ఒక శక్తిమంతమైన సందేశాన్ని పంపుతుందనీ... అది విస్తృత ప్రజా భాగస్వామ్యానికి స్ఫూర్తినిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# ఛత్తీస్‌గఢ్‌లోని ధమ్తారి జిల్లాలో వాటర్‌షెడ్ అభివృద్ధి ప్రాజెక్టులను సమీక్షించిన భూ వనరుల శాఖ కార్యదర్శి శ్రీ నరేంద్ర భూషణ్

న్యూ ఢిల్లీ, మే 16:కేంద్ర భూవనరుల శాఖ కార్యదర్శి శ్రీ నరేంద్ర భూషణ్ నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని ధమ్తారి జిల్లా మగర్లోడ్ మండలంలో పర్యటించింది. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై 2.0)లోని వాటర్‌షెడ్ అభివృద్ధి విభాగం కింద చేపట్టిన వివిధ వాటర్‌షెడ్ అభివృద్ధి ప్రాజెక్టులను ఈ బృందం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించింది.

జలవనరుల నిర్వహణ సంయుక్త కార్యదర్శి శ్రీ నితిన్ ఖడే, జిల్లా కలెక్టర్ శ్రీ అవినాష్ మిశ్రాలతో కూడిన ఈ ప్రతినిధి బృందం.. రక్షిత నీటిపారుదల, జీవనోపాధి పెంపుదల, నేల, నీటి సంరక్షణపై దృష్టి సారించిన వివిధ కార్యక్రమాలను సమీక్షించింది.

సంక్రా గ్రామ పర్యటనలో భాగంగా వాటర్‌షెడ్ అభివృద్ధి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాల నిధుల సమన్వయంతో రూ. 40.34 లక్షల వ్యయంతో నిర్మించిన ఒక ఆనకట్టను కార్యదర్శి పరిశీలించారు. ఈ నిర్మాణం ద్వారా సుమారు 80?85 ఎకరాలకు సాగునీరు అందుతోందని, 50 మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. బెలౌడి గ్రామంలో రూ. 20.20 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన 430 మీటర్ల సాగునీటి కాలువను ప్రతినిధి బృందం సమీక్షించింది. ఇది ప్రస్తుతం సుమారు 150 ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా, నేల కోతను గణనీయంగా తగ్గించడంలో సహాయపడింది.

ఈ బృందం సౌంగా గ్రామంలో అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన తోటను కూడా సందర్శించింది. అక్కడ ఒక నదీ ద్వీపంలో 1,050 జామ, నిమ్మ చెట్లను నాటారు. నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించడానికి, ఆ ప్రాంతంలో చిన్న కుంటలు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు.

# మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందజేత




విజయవాడ, మే 16: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ అసోసియేషన్ అనంతపురం జిల్లా సభ్యులు,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ని కలిసి, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల రెగ్యులరైజేషన్, నిధి పోర్టల్ సమస్యలు,వంద శాతం గ్రాస్ సాలరీ అమలు, మెడికల్ లీవ్, చైల్డ్ కేర్ లీవ్ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్



అమరావతి, మే 16:ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రతి అర్జీకి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సింగ్ నగర్ సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ డే ద్వారా స్వయంగా బొండా ఉమామహేశ్వరరావు సమస్యల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఏఎంసీఏ' కోర్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్.. 'నేవల్ సిస్టమ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ"లకు శంకుస్థాపన చేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, మే 16: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు ఈ రోజు వివిధ వ్యూహాత్మక 'ఏరోస్పేస్–డిఫెన్స్' ప్రాజెక్టులకు శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమాలను సంయుక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 5వ తరం అత్యాధునిక మధ్యతరహా యుద్ధ విమాన (ఏఎంసీఏ), ఇతర భవిష్యత్ స్వదేశీ రక్షణ వేదికల రూపకల్పనను వేగిరపరచేందుకు ఉద్దేశించిన 'కోర్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్'కు పుట్టపర్తిలో శంకుస్థాపన చేశారు. అలాగే ఆధునిక జలాంతర్గామి ఆయుధాలు, నావికా యుద్ధ వ్యవస్థల అవసరాలు తీర్చేందుకు నిర్దేశించిన 'నేవల్ సిస్టమ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ'కి అనకాపల్లి జిల్లాలోని టి.సిరసాపల్లి గ్రామంలో భూమిపూజ చేశారు.

మరోవైపు శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరలో 'డిఫెన్స్ ఎనర్జెటిక్స్ ఫెసిలిటీ', 'అమ్యూనిషన్ అండ్ ఎలక్ట్రిక్ ఫ్యూజెస్' ప్లాంటుకు భూమిపూజ చేశారు. అలాగే, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ఏర్పాటుకు 8 కంపెనీల సామూహిక సంస్థ (కన్సార్టియం) ముందుకొచ్చింది. వీటన్నిటితోపాటు రాష్ట్రంలో రక్షణ తయారీ పరిశ్రమల ఏర్పాటు దిశగా వివిధ కంపెనీలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

ఈ సందర్భంగా రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ– "ఇదొక చారిత్రక ఘట్టం" అని అభివర్ణించారు. ప్రస్తుత అంతర్జాతీయ అనిశ్చితి నడుమ జాతీయ ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా రక్షణ తయారీ రంగంలో స్వయంసమృద్ధి సాధించడం అత్యంత కీలక కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. జాతీయ భద్రతకు సంబంధించి నిరంతర దిగుమతి పరాధీనత నుంచి బయటపడి, స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యం కావాలన్నారు.

ఈ అంశాన్ని విశదీకరిస్తూ– "ప్రస్తుత ప్రాజెక్టులు రక్షణ దళాల్లోని అన్ని విభాగాల అవసరాలనూ తీర్చగలవు. ఈ వ్యూహాత్మక వైవిధ్యీకరణ యాదృచ్ఛికం కాదు... ఈ దిశగా మా లక్ష్యం సుస్పష్టం. రక్షణ రంగంలో స్వావలంబనపై దృఢ సంకల్పంతో మేం ముందడుగు వేస్తున్నాం. తద్వారా భవిష్యత సవాళ్లను ఎదుర్కొనేలా త్రివిధ దళాలను సంసిద్ధం చేయడంపై దృష్టి సారించాం. ఈ జాతీయ స్వయం సమృద్ధి సంకల్ప సాకారంతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి ప్రస్థానంలోనూ ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయి" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

నేడు శంకుస్థాపన, భూమి పూజ చేసిన ప్రాజెక్టులు శక్తిమంతమైన "ప్రగతి కూడళ్లు"గా (గ్రోత్ పోల్స్)గా రూపొంది, భారీ ఎత్తున ఉపాధిని సృష్టిస్తాయని మంత్రి పేర్కొన్నారు. " ఈ కార్యక్రమాల్లో దేశంలోని ఇంజనీరింగ్ కళాశాలలు, ఐటీఐలు సహా స్థానిక విద్యా సంస్థలు కూడా అంతర్భాగం అవుతాయి. తద్వారా పటిష్ఠ సరఫరా వ్యవస్థ ఏర్పడి, చిన్న తరహా పరిశ్రమలు కూడా వృద్ధి చెందుతాయి. అత్యాధునిక సాంకేతిక రంగంలో పనిచేయడంతోపాటు అనుభవ సముపార్జన ద్వారా స్థానిక యువత తమ జీవితంలో మరింత ఎదగడానికి వేదిక లభిస్తుంది. ఇదొక సమగ్ర రక్షణ తయారీ వ్యవస్థ వృద్ధికి దోహదం చేస్తూ, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలోనూ ప్రధాన పాత్ర పోషించగలదు" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

ప్రస్తుత 'ఏఎంసీఏ' కార్యక్రమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15,000 కోట్లు కేటాయించింది. ఇందులో డీఆర్‌డీఓ అనుబంధ సంస్థ 'ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ' పరిధిలో రూ.2,000 కోట్లతో ఏర్పాటయ్యే 'కోర్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్' ఓ కీలక భాగంగా ఉంటుంది. "గగనతలంలోకి ఐదో తరం యుద్ధ విమానాలను ప్రవేశపెట్టగల ప్రపంచంలోని అరుదైన ప్రదేశాల జాబితాలో పుట్టపర్తి కూడా స్థానం సంపాదిస్తుంది. శత్రువును రెప్పపాటులో మట్టుపెట్టే సామర్థ్యంగల కలిగిన అత్యాధునిక యుద్ధ విమానానికి ఇదొక జన్మభూమిగా మారుతుంది'' అని ఆయన అభివర్ణించారు.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) పరిధిలోరూ.480 కోట్లతో చేపట్టే 'నేవల్ సిస్టమ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ' స్వయంచలిత జలాంతర్గత వాహనాలు, జలాంతర ప్రతిదాడి వ్యవస్థలు, భావితరం టార్పిడోల ఉత్పాదనపై దృష్టి సారిస్తుంది. వీటికి సంబంధించి ఇప్పటిదాకా దేశం దిగుమతి చేసుకుంటున్న అనేక కీలక విడిభాగాలు, ఉప-వ్యవస్థలను ఈ కేంద్రం తయారు చేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే భారత నావికాదళ సామర్థ్యం గణనీయంగా ఇనుమడిస్తుంది. దీంతోపాటు దేశ నీలి ఆర్థిక వ్యవస్థ, సముద్ర రంగ భద్రతలో కీలక మలుపుగా మారుతుందని రక్షణ మంత్రి వివరించారు.

భారత్ ఫోర్జ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ 'ఆగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్' పరిధిలో 'డిఫెన్స్ ఎనర్జెటిక్స్ ఫెసిలిటీ' రూ.1,500 కోట్లతో ఏర్పాటవుతోంది. భవిష్యత్ యుద్ధాలకు భారత దళాల సంసిద్ధతను బలోపేతం చేయగల ఆయుధాలను ఈ కేంద్రం ఉత్పత్తి చేస్తుందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

'హెచ్‌ఎఫ్‌సీఎల్ లిమిటెడ్' ఆధ్వర్యాన దాదాపు రూ.1,200 కోట్లతో 'అమ్యూనిషన్ అండ్ ఎలక్ట్రిక్ ఫ్యూజ్ ప్లాంట్' ఏర్పాటవుతోంది. ఎలాంటి మందుగుండు సామగ్రిలోనైనా 'ఫ్యూజ్' అత్యంత ప్రధాన భాగం కాబట్టి, మందుగుండు తయారీలో దేశ స్వావలంబన ప్రస్థానంలో నూతనాధ్యాయానికి ఈ ప్రాజెక్టు నాంది పలుకు తుందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. "ఈ ప్లాంటులో తయారయ్యే అత్యాధునిక ఫ్యూజ్‌లు మన రక్షణ దళాల సామర్థ్యాన్ని గణనీయంగా బలోపేతం చేస్తాయి" అన్నారు.

కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటును ప్రస్తావిస్తూ– ఈ దిశగా యువ పారిశ్రామికవేత్తల సమష్టి దృక్కోణాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. పరిమాణం రీత్యా ఇవి చిన్నచిన్నవే అయినా, 'మేక్ ఇన్ ఇండియా' దార్శనికతను సుస్పష్ట వాస్తవికతగా మార్చడంలో ఇవి కీలక భాగమని ఆయన అన్నారు. "ఆధునిక యుద్ధంలో డ్రోన్ సాంకేతికత ఓ కీలక మలుపుగా మారింది. దీంతోపాటు ఇతరత్రా రంగాల్లోనూ దీని ఆవశ్యకత నానాటికీ విస్తరిస్తోంది. కర్నూలు డ్రోన్ సిటీలో ఉత్పత్తయ్యే డ్రోన్లు భారత నాణ్యత ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో చాటగలవని విశ్వసిస్తున్నాను. సూరత్‌ను 'డైమండ్ సిటీ'గా, బెంగళూరును 'సిలికాన్ వ్యాలీ'గా వ్యవహరిస్తున్న తీరులోనే కర్నూలు ప్రాంతం త్వరలో భారత 'డ్రోన్ హబ్'గా గుర్తింపు పొందడటం తథ్యం" అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా ప్రభుత్వ-ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు కృషి చేసిందని రక్షణ మంత్రి గుర్తుచేశారు. దేశం నేడు 'ఏకోన్ముఖ ప్రభుత్వ' విధానం మాత్రమేగాక ఏకోన్ముఖ దేశ–ప్రజా' విధానం'తోనూ ముందడుగు వేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు "వ్యక్తిగత ఆవిష్కర్త లేదా ఓ భారీ సంస్థ లేదా అంకుర సంస్థ లేదా 'ఎంఎస్ఎంఈ' వంటిదేదైనా జాతీయ భద్రతకు తోడ్పడటాన్ని తమ కర్తవ్యంగా పరిగణిస్తున్నాయి. ఈ క్రమంలోనే రక్షణ తయారీ రంగాన్ని ప్రజా ఉద్యమంగా రూపుదిద్దడంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానం విజయవంతమైంది'' అని ఆయన వివరించారు.

ప్రభుత్వ అవిరళ కృషి ఫలితంగా రక్షణ రంగంలో నేటి వరకూ సాధించిన ప్రగతిని వివరిస్తూ– దేశంలో 2014 నాటికి రక్షణ ఉత్పాదకత కేవలం రూ.46,000 కోట్లు మాత్రమేనని, ప్రస్తుతం రూ.1.54 లక్షల కోట్లకు చేరువైందని తెలిపారు. ఈ క్రమంలో ఒకటిరెండు నెలల్లోనే రూ.1.75 లక్షల కోట్ల అత్యంత గరిష్ఠ స్థాయిని నమోదు చేయడం ద్వారా కొత్త రికార్డు సృష్టించనుందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. దేశం నుంచి రక్షణ ఎగుమతులు దశాబ్దం కిందట రూ.600 కోట్లు కాగా, నేడు రూ.40,000 కోట్లకు పెరిగి, కొత్త రికార్డుకు చేరువయ్యాయని వివరించారు.

దేశంలో నేడు తప్పుదోవ పట్టించే సమాచార విస్తృతిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రక్షణశాఖ మంత్రి హెచ్చరించారు. "మన శత్రువులు ఇప్పుడు సాయుధ దాడికి ప్రయత్నించే అవసరం లేదు. కేవలం వదంతులు, తప్పుదోవ పట్టించే సమాచార వ్యాప్తితోనూ జాతీయ భద్రతకు హాని చేయగలరు. దేశంలో చమురు నిల్వలు నిండుకున్నాయని లేదా దేశానికి పెను విపత్తు ముంచుకొస్తోందని వారు వదంతులు సృష్టించవచ్చు. ప్రజలను గందరగోళానికి గురిచేసి, అరాచకత్వం సృష్టించే దురుద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడతారు. తప్పుదోవ పట్టించే సమాచారం స్వల్పమైనదే అయినా, తీవ్ర హానికారకం కాగలదు. కాబట్టి, మనం అత్యంత జాగరూకతతో మెలగాలి. ప్రజా రవాణా వినియోగం వైపు మళ్లాలని లేదా ఇంధనం పొదుపు చేయాలని ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తిని ఒక సలహాగా మాత్రమే మనం స్వీకరించాలి" అని సూచించారు.

చివరగా– దేశ పురోగమనం సమష్టి కృషితోనే సాధ్యమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "మనమంతా భుజం కలిపి స్వీయ రక్షణ మాత్రమేగాక విశ్వ సౌభ్రాత్ర స్ఫూర్తితో యావత్ ప్రపంచానికి చేయూతనివ్వగల దేశంగా భారత్‌ను రూపుదిద్దుదాం" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగం ముగించారు.

అనంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ– దేశీయీకరణ, స్వావలంబనపై నిరంతర శ్రద్ధతో భారత రక్షణ సామర్థ్య బలోపేతానికి, సైనిక బలగాల ఆధునికీకరణకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. సంస్కరణలు, పెట్టుబడులు, ఆవిష్కరణలపై నిరంతరం దృష్టి సారించడం ద్వారా రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో దేశ సన్నద్ధత, అంతర్జాతీయ ప్రాధాన్యం ఎంతగానో పెరిగాయని ఆయన పేర్కొన్నారు.

రక్షణ రంగంలో ఇనుమడిస్తున్న భారత్ శక్తిసామర్థ్యాలకు, సాంకేతిక ప్రగతికి, స్వావలంబనకు 'ఆపరేషన్ సిందూర్' ప్రతిష్ఠాత్మక విజయం నిదర్శనమని ఆయన అభివర్ణించారు. నేడు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు దేశ రక్షణ సన్నద్ధతను బలోపేతం చేయడమేగాక ప్రాంతీయ ప్రగతికి దోహదం చేస్తాయని చెప్పారు.

ఈ సందర్భంగా "డిజైన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, మేక్ ఇన్ ఆంధ్రప్రదేశ్, లీడ్ ఫ్రమ్ ఆంధ్రప్రదేశ్" అంటూ పరిశ్రమలకు, పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ దిశగా తమ ప్రభుత్వం అన్నివిధాలా సహాయసహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ''నవ్యావిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణ అనే త్రివిధ శక్తిసామర్థ్యాలతో నవ్యాంధ్రప్రదేశ్ రూపుదిద్దుకుంటోంది. వికసిత భారత్ దిశగా దేశ ప్రస్థానానికి ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచి సారథ్యం వహిస్తుంది'' అని ఆయన ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, రక్షణ రంగ ఉత్పత్తి విభాగం కార్యదర్శి శ్రీ సంజీవ్ కుమార్, ఆ శాఖలోని ఇతర ఉన్నతాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైభవంగా అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీనివాస కళ్యాణం

**-లోక కళ్యాణార్థం నీలం కవిత మధు దంపతుల సంకల్పం**
**-అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా సాగిన వేడుక**
**-భారీగా తరలివచ్చిన భక్తజనం, పాల్గొన్న ప్రముఖులు**
**-గోవింద నామస్మరణతో మారుమోగిన పరిసరాలు**



సంగారెడ్డి, మే 16: ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా, భక్తుల జయజయధ్వానాల మధ్య ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయం ఒక మినీ తిరుపతిని తలపించింది. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్–కవిత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఫసల్వాది జ్యోతిర్వస్తు పీఠం మహేశ్వర సిద్ధాంతి శర్మ, భూపతి స్వామి ఆశీస్సులతో సిరిసిల్ల బీటుకూరి నవీన్ ఆచార్య పర్యవేక్షణలో నిర్వహించిన అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా, అత్యంత వైభవంగా జరిగింది.

లోక కళ్యాణార్థం, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలనే సత్సంకల్పంతో నిర్వహించిన ఈ వేడుకకు భక్తజనం పోటెత్తింది. కళ్యాణ మహోత్సవం కోసం చిట్కుల్ లోని ఎన్ఎంఆర్ క్యాంప్ కార్యాలయం ఆవరణలో సర్వాంగ సుందరంగా భారీ వేదికను తీర్చిదిద్దారు. సిరిసిల్ల నుండి విచ్చేసిన పండిత బృందం ఈ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుండే మంగళ వాయిద్యాలు, వేద పఠనాలతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీనివాసుడు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, విశేష ఆభరణాలతో అలంకరించి వేదికపైకి తీసుకురావడంతో భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది.

నీలం కవిత నీలం మధు దంపతులు సంప్రదాయబద్ధంగా పీఠంపై కూర్చుని కళ్యాణ క్రతువులో పాల్గొన్నారు. విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైన ఈ వేడుకలో పుణ్యాహవాచనం, విష్వక్సేన ఆరాధన, అంకురార్పణ వంటి ఘట్టాలను అర్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. అనంతరం స్వామి వారికి, అమ్మవార్లకు కంకణధారణ గావించి, ప్రవరను చదివి వినిపించారు. జీలకర్ర బెల్లం ఉంచే సమయానికి భక్తుల హర్షధ్వానాల మధ్య ఆధ్యాత్మిక ఉద్వేగం నెలకొంది. లోక రక్షకుడైన శ్రీనివాసుడు అమ్మవార్ల మెడలో మాంగల్యధారణ గావించిన ఘట్టం భక్తుల కళ్లకు కట్టినట్లుగా సాగింది. నీలం కవిత మధు దంపతులు స్వామివారికి ముత్యాల తలంబ్రాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. "శ్రీవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఈ కళ్యాణాన్ని నిర్వహించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న మాకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఎంతో మానసిక తృప్తిని ఇచ్చిందని వివరించారు. ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల చెంత ఉండి సేవలందిస్తామని వారు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఈ వేడుకను వీక్షించేందుకు చిట్కుల్‌తో పాటు పటాన్‌చెరు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ, ముత్తంగితో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అంతకుముందు నీలం కవిత మధు దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారి నివాసంలో ప్రత్యేక పూజలు, యజ్ఞాది కార్యక్రమాలు నిర్వహించారు.

టీజీఐఐసీ చైర్మన్, డీసీసీ ప్రెసిడెంట్ నిర్మలజగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, పటాన్చెరు ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, మెదక్ డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్, మహిళా కమిషన్ మెంబెర్ శశికళ యాదవరెడ్డి, సిద్దిపేట ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పటాన్చెరు ఏఎంసీ చైర్మన్ శివానందం, ఇస్నాపూర్ మున్సిపాలిటీ కమిషనర్, కౌన్సిలర్లు, పటాన్చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్ రెడ్డి, ఐఎన్టియూసీ జిల్లా ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, విచ్చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం విచ్చేసిన భక్తజనానికి అన్నదాన కార్యక్రమం నిర్వహించి, స్వామివారి లడ్డుప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, కాంగ్రెస్ మండల, బ్లాక్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.

# టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం

**-భక్తుల ఉచిత రవాణా కోసం వినియోగించనున్న టీటీడీ**



తిరుపతి, మే 16:చెన్నైకు చెందిన వర ఫ్యూచర్ ఎల్ఎల్పీ సంస్థ చైర్మన్ వర్ధమాన్ జైన్ శనివారం ఉదయం టీటీడీకి ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ముందు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బస్సుకు సంబంధించిన పత్రాలు, తాళాలను టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి కు దాత అందజేశారు.

ఈ సందర్భంగా అదనపు ఈవో దాతతో కలిసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు ఈ బస్సు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొంటూ దాతను అభినందించారు. టీటీడీ ఈ ఎలక్ట్రిక్ బస్సును తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ఉచిత రవాణా సేవల కోసం వినియోగించనుంది. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు డీపీ అనంత, తిరుమల ట్రాన్స్‌పోర్ట్ డీఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్లాస్గోలో జరగనున్న 2026 కామన్వెల్త్ క్రీడల కోసం భారత్ సన్నద్ధతపై కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ సమీక్ష

న్యూఢిల్లీ, మే 16: స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరగనున్న 2026 కామన్వెల్త్ క్రీడల కోసం భారత్ సన్నాహాలను సమీక్షించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో అన్ని భాగస్వామ్య పక్షాల మధ్య పూర్తి సమన్వయం ఉండేలా చూడటం, సీడబ్ల్యూజీ 2026 కోసం సిద్ధమవుతున్న భారతీయ క్రీడాకారులకు అవసరమైన సహాయక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించారు.

ఈ సమావేశానికి యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో వచ్చే ఏడాది జరగబోయే కామన్వెల్త్ క్రీడల కోసం నియమితులైన షెఫ్ డి మిషన్‌తోపాటు (బృంద నాయకుడు) భారత క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు కూడా ఉన్నారు. వీరంతా క్రీడలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక, క్రీడాకారుల సన్నద్ధత, సమన్వయ ప్రయత్నాలపై తాజా వివరాలను వెల్లడించారు.

భారత కామన్వెల్త్ క్రీడల ప్రచారంలో భాగంగా క్రీడాకారుల శిక్షణ, రవాణా, సంక్షేమం, వివిధ విభాగాల మధ్య సమన్వయంపై కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ సుదీర్ఘంగా చర్చించారు.

భారతీయ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచేందుకు, వారికి అన్ని విధాలా మద్దతు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దేశానికి విజయవంతమైన ఫలితాలు అందించేందుకు ముందస్తు ప్రణాళిక, ఏజెన్సీల మధ్య సమన్వయం, క్రీడాకారుల అవసరాలే ప్రాధాన్యంగా సన్నాహాలు ఉండాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో 2026 కామన్వెల్త్ క్రీడల ముగింపు వేడుకకు సంబంధించిన సన్నాహాలపై కూడా చర్చించారు. ఆ వేడుకల్లోనే 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్య దేశంగా భారత్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించనున్నారు.

ఈ క్రీడలు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరగనున్న నేపథ్యంలో గుజరాత్ ఉప ముఖ్యమంత్రి శ్రీ హర్ష్ సంఘ్వీ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొని ప్రాథమిక చర్చలు జరిపారు.

గ్లాస్గో 2026 కోసం జరుగుతున్న కార్యాచరణ, రవాణా సంబంధిత సన్నాహాలపై వివిధ మంత్రిత్వ శాఖలతో క్రీడల శాఖ కార్యదర్శి జరుపుతున్న సమన్వయ ప్రయత్నాలను కూడా ఈ బృందం సమీక్షించింది. క్రీడల నిర్వహణలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా అంతర్ మంత్రిత్వ శాఖల సహకారం కీలకమని సభ్యులు తెలిపారు.

2026 కామన్వెల్త్ క్రీడల కోసం భారత క్రీడా బృందానికి సంబంధించి అంతర్ మంత్రిత్వ శాఖల సమన్వయం, సహాయక చర్యలు, అన్ని ఏర్పాట్లు సజావుగా అమలు చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు.

క్రీడల కోసం రూపొందిస్తున్న కార్యాచరణ ప్రణాళికపై భారత క్రీడా ప్రాధికార సంస్థ, క్రీడల మంత్రిత్వ శాఖ అధికారులు సమావేశంలో చర్చించారు. ఇందులో క్రీడాకారులకు అంతర్జాతీయ పోటీల అనుభవం, శిక్షణ షెడ్యూళ్లు, సహాయక సిబ్బంది నియామకం, అత్యవసర పరిస్థితుల్లో ఎదుర్కొనే ప్రణాళికల గురించి వివరించారు.

2026 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత ప్రచారాన్ని దిగ్విజయం చేసేందుకు క్రీడల మంత్రిత్వ శాఖ, ఐఓఏ, ఎస్ఏఐ, గుజరాత్ ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య పక్షాలన్నీ తమ సమష్టి నిబద్ధతను చాటాయి.

# చెన్నూర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్



మంచిర్యాల మే 16: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో శనివారం వేకువజామున చెన్నూర్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు ఉదయం 5 గంటల నుంచి 7.30 గంటల వరకు ఈ తనిఖీలు చేపట్టారు.

చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో 15 మంది పోలీస్ సిబ్బందితో కలిసి "కమ్యూనిటీ కాంటాక్ట్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 65 బైకులు, 5 ఆటోలను సీజ్ చేసి జరిమానాలు విధించారు.

అలాగే గుడుంబా విక్రయాలపై ఆరా తీసి, అనుమానితుల ఇళ్లలో ప్రత్యేక బలగాలతో తనిఖీలు చేపట్టారు. కాలనీలో కొత్తగా నివాసం ఉంటున్న వారి వివరాలను సేకరించారు.

ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే సమర్థవంతమైన నేర నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. కాలనీలో నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు లేదా అపరిచితులు ఆశ్రయం పొందుతున్నట్లు అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

యువత మత్తుపదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నుంచి జాగ్రత్త పడాలని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కాలనీ భద్రత కోసం స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేర నియంత్రణకు సహకరించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక పోలీస్ బలగాలు పాల్గొన్నారు.

# వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన సెమీకండక్టర్ పరిశ్రమలోకి రాజస్థాన్ ప్రవేశించడాన్ని అభినందించిన కేంద్ర మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, మే 16:రాజస్థాన్‌లోని భివాడీకి చెందిన ఖుష్‌ఖేరా పరిధిలోని సలార్‌పూర్‌లో ఎల్సినా అభివృద్ధి చేసిన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌తో (ఈఎంసీ) పాటు సహస్ర సెమీకండక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన 'సెమీకండక్టర్ ఏటీఎంపీ/ఓశాట్' ప్లాంట్‌ను కేంద్ర ఎలక్ట్రానిక్స్ - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ రోజు ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ.. కేంద్ర పర్యావరణ, అటవీ- వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ సమక్షంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.

ఎలక్ట్రానిక్స్ తయారీ, సెమీకండక్టర్ల రంగంలో భారతదేశాన్ని ప్రపంచ ప్రధాన కేంద్రంగా మార్చే ప్రయాణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రారంభమైన మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి దూరదృష్టితో కూడిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలే ఈ ప్రగతికి ప్రధాన చోదక శక్తులుగా నిలుస్తున్నాయి.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన శ్రీ అశ్విని వైష్ణవ్.. రాజస్థాన్ రాష్ట్రానికి ఇదొక చారిత్రాత్మక రోజని కొనియాడారు. భౌగోళిక రాజకీయ కోణంలో అంతర్జాతీయంగా అత్యంత వ్యూహాత్మకమైన సెమీకండక్టర్ పరిశ్రమలోకి రాజస్థాన్ అడుగుపెట్టడం విశేషమని ఆయన అన్నారు.

గడిచిన 12 ఏళ్లలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్ సాధించిన వేగవంతమైన పురోగతిని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. ఈ రంగంలో దేశీయ ఉత్పత్తి 6 రెట్లు పెరిగి దాదాపు రూ. 13 లక్షల కోట్లకు చేరుకుందని.. ఎగుమతులు కూడా సుమారు రూ. 4.24 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు భారతదేశపు అగ్రగామి ఎగుమతి వస్తువుగా అవతరించాయని ఆయన చెప్పారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగాలను రెండింటినీ ప్రత్యేక 'ఫోకస్ రంగాలు'గా గుర్తించడమే ఈ విజయానికి కారణమని కేంద్ర మంత్రి కొనియాడారు. ఈసీఎంఎస్ (ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్), ఈఎంసీ (ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్), ఐఎస్ఎం (ఇండియా సెమీకండక్టర్ మిషన్), పీఎల్ఐ (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్) వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమతో కలిసి క్రమబద్ధమైన విధానంతో అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2026 మార్చిలో "రాజస్థాన్ సెమీకండక్టర్ విధానాన్ని" తీసుకొచ్చిందని చెప్పారు. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతానికి సమీపంలో ఉన్న జోన్‌ను ఒక భారీ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడమే తమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ సైతం ఈ అంశాన్ని ప్రస్తావించారు. గతంలో భివాడీ ప్రాంతం ప్రధానంగా ఆటోమొబైల్ రంగానికి మాత్రమే ప్రసిద్ధి చెందిందని.. అయితే ఇప్పుడు ఇక్కడ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

భివాడీలోని ఈ క్లస్టర్‌ను రూ. 46.09 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో 50.3 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఈఎంసీ పథకం కింద రూ. 20.24 కోట్ల ప్రత్యక్ష ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించింది.

ఈ క్లస్టర్‌ను ఎల్సినా ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసింది. ఇది ఎల్సినా ఆధ్వర్యంలో పనిచేసే ఎంఎస్ఎంఈ పరిశ్రమల ప్రతినిధుల ఉమ్మడి భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న ఒక ప్రత్యేక సంస్థ.

ఈ క్లస్టర్‌లో అంతరాయం లేని విద్యుత్, నీటి సరఫరా, అంతర్గత రహదారులు, కేంద్రీకృత పరిపాలనా వసతులు, టెస్టింగ్- శిక్షణ కేంద్రాలతో పాటు స్మార్ట్ తరగతి గదులు, ల్యాబొరేటరీలతో కూడిన ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రం వంటి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

ఈ క్లస్టర్ జాతీయ రాజధాని ప్రాంతానికి సమీపంలో ఉండటంతో పాటు మంచి రోడ్డు, రైలు, వైమానిక రవాణా అనుసంధానంతో వ్యూహాత్మకంగా ఏర్పాటైంది. ఈ అనుకూలతల కారణంగా ఈ క్లస్టర్ భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీకి ఒక ప్రధాన కేంద్రంగా మారుతుందని భావిస్తున్నారు.

ఈ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో (ఈఎంసీ) రూ. 1,200 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు 20 కంపెనీలు ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాయి. ఈ కంపెనీలు సెమీకండక్టర్ ప్యాకేజింగ్, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, ఎయిర్ కండిషనర్లు, ఆర్ఎఫ్ఐడీ సాంకేతికతలు, ఈవీ విడిభాగాలు, పారిశ్రామిక ఎలక్ట్రానిక్స్ వంటి విభిన్న రంగాలలో పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఈ క్లస్టర్‌లో పదిహేను కంపెనీలు రూ. 900 కోట్లకు పైగా మొత్తం పెట్టుబడులతో కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ఇవి 2,700 మందికి పైగా ఉపాధిని కల్పిస్తున్నాయి.

ఈ క్లస్టర్‌లో ప్రస్తుతం నడుస్తున్న ప్రధాన కంపెనీలలో ఐసాన్ ఫియేమ్ ఇండస్ట్రీస్, ఈ-ప్యాక్ డ్యూరబుల్, సహస్ర సెమీకండక్టర్స్, సహస్ర ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, దుగ్గర్ పవర్ ప్రొడక్ట్స్, ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మొదలైనవి ఉన్నాయి.

సహస్ర సెమీకండక్టర్స్ ప్రైవేట్ సంస్థకు చెందిన ఈ ప్లాంట్ సెమీకండక్టర్ చిప్‌ల వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించిన భారతదేశపు మొట్టమొదటి చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) కావడం విశేషం.

కేంద్ర ఎలక్ట్రానిక్స్ - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మైటీ) 'ఎస్‌పీఈసీఎస్ (స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ అండ్ సెమీకండక్టర్స్)' పథకం కింద రూ. 150 కోట్లకు పైగా పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 57,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్లాంట్‌లో అత్యాధునిక 'క్లాస్ 10కె, 100కె పరిశుభ్రమైన గదులు' ఉన్నాయి. ఈ ప్లాంట్‌లో మైక్రో ఎస్డీ, ఫ్లాష్ స్టోరేజ్ వంటి ఉత్పత్తుల కోసం మెమరీ చిప్‌లతో పాటు ఎల్ఈడీ డ్రైవర్ ఐసీలు, ఈ-సిమ్‌లు, ఆర్ఎఫ్ఐడీ ఉత్పత్తుల ప్యాకేజింగ్ పనులను చేపట్టనున్నారు.

ప్రస్తుతం ఈ ప్లాంట్ ఏటా 60 మిలియన్ సెమీకండక్టర్ యూనిట్లను ప్యాకేజింగ్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అలాగే ఎస్‌పీఈసీఎస్ పథకం మద్దతుతో ఉత్పత్తి సామర్థ్యం దాదాపు 43 మిలియన్ యూనిట్లుగా ఉంటుందన్న అంచనా ఉంది. రాబోయే 2-3 ఏళ్లలో దీనిని ఏటా దాదాపు 400 నుంచి 600 మిలియన్ యూనిట్లకు పెంచాలని సంస్థ యోచిస్తోంది.

ఈ ప్లాంట్ ఇప్పటికే మొత్తం ఉత్పత్తిలో 60 శాతానికి పైగా భాగాలను అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, తూర్పు యూరప్ దేశాలు, చైనా, నేపాల్ వంటి అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేస్తోంది.

ఈ ప్లాంట్ ఇప్పుడు ఎల్ఈడీ డ్రైవర్ చిప్‌లు, ఇతర సెమీకండక్టర్ ఉత్పత్తులతో పాటు సొంతంగా ఉత్పత్తుల పరిశోధన, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. అలాగే ఈఎస్ఎస్‌సీఐ, ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థల భాగస్వామ్యంతో సెమీకండక్టర్ ప్యాకేజింగ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన పరీక్షా రంగాల్లో యువతకు శిక్షణ అందించేందుకు కూడా ఇది మద్దతు ఇవ్వనుంది.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా సాధ్యమైనంత వరకు ఇంధన వినియోగాన్ని తగ్గించాలంటూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును గౌరవిస్తూ ఈ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించారు.

# ఔషధ నాణ్యతను నిర్ధారించడంలో భారతీయ ఫార్మకోపియా నిర్దేశక ప్రమాణాలు, మలినాల ప్రమాణాల ప్రాధాన్యంపై దృష్టి సారించిన సదస్సు

న్యూఢిల్లీ, మే 16: తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్న జాతీయ ఫార్మాస్యూటికల్ విద్య, పరిశోధన సంస్థ (నైపర్)లో శాస్త్రీయ సదస్సును, భారతీయ ఫార్మకోపియా-2026పై చర్చా కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ ఫార్మకోపియా కమిషన్ (ఐపీసీ) నిర్వహించింది. నైపర్ హైదరాబాద్, కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో), ఐడీఎంఏ తెలంగాణ ఛాప్టర్ సహకారంతో వీటిని నిర్వహించింది. "ఔషధ నాణ్యతను నిర్ధారించడంలో ఇండియన్ ఫార్మకోపియా నిర్దేశక ప్రమాణాలు, మలినాల ప్రమాణాల ప్రాధాన్యం" అనే ఇతివృత్తంపై ఈ సదస్సు జరిగింది.

ఔషధాల నాణ్యతను, భద్రతను, హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు ఔషధాల నాణ్యతను బలోపేతం చేయడం, రోగి భద్రతను పరిరక్షించడమే లక్ష్యంగా ఐపీసీ వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. ప్రజారోగ్య రక్షణలో ఔషధాల నాణ్యత కీలకమైన అంశమని గుర్తించి, శాస్త్రీయ, నియంత్రణ, భాగస్వాములతో సహకార వేదికల ద్వారా ఔషధ నాణ్యతకు సంబంధించిన సమస్యలను ఐపీసీ నిరంతరం పరిష్కరిస్తోంది. ఔషధాల నాణ్యత, భద్రత, సామర్థ్యాన్ని నిర్ధారించడంలో ఇండియన్ ఫార్మకోపియా రిఫరెన్స్ సబ్‌స్టాన్సెస్ (ఐఆర్‌పీఎస్), మలినాల ప్రమాణాల ప్రాముఖ్యతపై చర్చించడానికి ఈ సదస్సును నిర్వహించారు.

ఈ సదస్సును హైదరాబాద్ నైపర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శైలేంద్ర సరఫ్ లాంఛనంగా ప్రారంభించారు. ఫార్మాస్యూటికల్ నాణ్యతా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేలా విద్యాసంస్థలతో కలసి పనిచేస్తున్నందుకు ఐపీసీని ఆయన అభినందించారు. నైపర్ హైదరాబాద్, గతంలో నైపర్ అహ్మదాబాద్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఏర్పాటు చేసుకున్న ఈ తరహా సహకారాలు.. నియంత్రణా సంస్థలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక భాగస్వాముల మధ్య శాస్త్రీయ పరిజ్ఞాన వినిమయానికి, సామర్థ్య నిర్మాణానికి ముఖ్యమైన వేదికను అందిస్తాయని తెలియజేశారు.

ఫార్మాస్యూటికల్ మలినాల వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలను తగ్గించడంలో వ్యర్థాల ప్రొఫైలింగ్, శాస్త్రీయంగా ఏర్పాటు చేసిన ఫార్మకోపియా ప్రమాణాలు ముఖ్యమైన అంశాలని ఐపీసీ కార్యదర్శిగా, శాస్త్రీయ సంచాలకులుగా వ్యవహరిస్తున్న డాక్టర్ వీ కలైసెల్వన్ స్పష్టం చేశారు. విస్తృతమైన ఫార్మకోపియా ప్రమాణాలు, నాణ్యతా హామీ యంత్రాంగాల ద్వారా ఔషధ నాణ్యతా వ్యవస్థలను బలోపేతం చేసి వికసిత్ భారత్ లక్ష్యానికి దోహదపడేందుకు ఐపీసీ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

ప్రారంభ కార్యక్రమానికి ఐపీసీ, సీడీఎస్‌సీవో, నైపర్ హైదరాబాద్‌కు చెందిన ఉన్నతాధికారులు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని సీడీఎస్‌సీవో డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ (ఇండియా) శ్రీ కే నరేంద్రన్ ఈ కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఔషధాల నాణ్యతకు హామీ ఇచ్చేలా ఏకీకృత ప్రమాణాలు, నియంత్రణ సంస్థల పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు.

ఔషధ నాణ్యత, వైద్య రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు. ఔషధాల వల్ల ఎదురయ్యే తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు, రోగి భద్రతా సమస్యలతో పాటుగా ఫార్మకోపియల్ మలినాల వల్ల ఎదురయ్యే క్లినికల్ ప్రభావాలపై చర్చించేందుకు తొలిసారిగా నియంత్రణ, విశ్లేషణ, పారిశ్రామిక, క్లినికల్ రంగాలకు చెందిన నిపుణులను ఐపీసీ ఒకే వేదిక మీదకు తీసుకొచ్చింది. ఐపీఆర్ఎస్, మలినాల ప్రమాణాల అభివృద్ధి, స్వీకరణ, అమల్లో చురుగ్గా పాల్గొంటున్న ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకొనే అవకాశాన్ని ఈ సదస్సు అందించింది.

ఫార్మకోపియా ప్రమాణాలు, మలినాల నియంత్రణ, నియంత్రణల అమలు, భారతీయ ఫార్మకోపియా -2026లో పురోగతులు, మలినాల నిర్దేశక ప్రమాణాలు, ఫార్మాస్యూటికల్ నాణ్యతకు హామీ, ప్రమాద అంచనా విధానాలు, ఫార్మాస్యూటికల్ మలినాల నిర్వహణ-నియంత్రణలో అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లు తదితర సమకాలీన అంశాలపై సాంకేతిక సెషన్లలో ఐపీసీ, సీడీఎస్‌సీవో, విద్యాసంస్థలు, ఫార్మాస్యూటికల్ రంగానికి చెందిన నిపుణులు చర్చించారు.

ఫార్మాస్యూటికల్ మలినాలు, విశ్లేషణ పద్ధతులు, నియంత్రణల అంచనాలు, అమలులో ఎదురయ్యే సవాళ్లకు సంబంధించిన వివిధ అంశాలపై ఐపీసీ, సీడీఎస్‌సీవో, రాష్ట్రాల లైసెన్సింగ్ అథారిటీలు, విద్యావేత్తలు, వైద్యులు, పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులతో జరిగిన చర్చా కార్యక్రమంతో సదస్సు ముగిసింది.

దేశవ్యాప్తంగా ఉన్న నియంత్రణ సంస్థల ప్రతినిధులు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు, వైద్యులు, అనలిటికల్ శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శాస్త్రీయంగా పటిష్ఠంగా ఉన్న ఫార్మకోపియా ప్రమాణాల ద్వారా ఔషధ నాణ్యత వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజారోగ్య భద్రతను ప్రోత్సహించడంలో ఐపీసీ నిబద్ధతను ఈ సదస్సు పునరుద్ఘాటిస్తుంది.

# అప్రమత్తతతో విధులు నిర్వహించాలి.. పోలీసులకు మెదక్ డీఎస్పీ సూచన



మెదక్, మే 16: మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన వారాంతపు పరేడ్‌ను మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది పరేడ్‌లో పాల్గొని డ్రిల్ నిర్వహించారు. సిబ్బంది టర్నౌట్, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆయుధాల నిర్వహణ విధానాన్ని డీఎస్పీ పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. శారీరక దృఢత్వం కోసం ప్రతి రోజు వ్యాయామం, డ్రిల్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడే విధంగా సిబ్బంది నడుచుకోవాలని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని తెలిపారు.

# 91.41 శాతం ఉత్తీర్ణత నమోదు

అమరావతి, మే 16:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ఐసెట్-2026 ఫలితాలను అధికారులు విడుదల చేశారు. ఈసారి పరీక్షలో 91.41 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు.

మొత్తం 23,198 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, వారిలో 21,205 మంది అర్హత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను AP ICET Results Portal వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అధికారులు సూచించారు.

# సుప్రీంకోర్టులో.. ఆగస్టు 21, 22, 23 తేదీలలో ప్రత్యేక లోక్ అదాలత్!

## -న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ జియావుద్దీన్




అమరావతి, మే 16: సుప్రీంకోర్టులో.. ఈ ఏడాది ఆగస్టు 21, 22, 23 తేదీలలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ జియావుద్దీన్ తెలిపారు. "సమాధాన్ సమారోహ ? 2026" లో భాగంగా శనివారం ఆయన పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా వైద్యశాల సమీపంలో పలువురు బాటసారులతో, చిరు వ్యాపారులతో మాట్లాడారు. అనంతరం స్థానిక సబ్ జైల్ ను సందర్శించి, ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జియావుద్దీన్ గారు మాట్లాడుతూ సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్న వ్యాజ్యాలను కక్షిదారులు పరిష్కరించుకోవాలని సూచించారు.

ఫిర్యాదిదారులు, కక్షిదారులు సుప్రీంకోర్టు వారి అంగీకారంతో వారి వారి, న్యాయవాదులతో జిల్లాలోనే వర్చువల్ గా హాజరు కావచ్చునన్నారు. రాజీమార్గం ద్వారా తమ వ్యాజ్యాలను పరిష్కరించుకోవడానికి ఇష్టపడితే తమ కేసులను పరిశీలన కోసం నిర్దేశించిన, గూగుల్ ఫోరంల ద్వారా వారి అంగీకారాన్ని ఈ నెల 31వ తేదీ లోగా సమర్పించాలని సూచించారు. కేసుల పరిష్కారంలో సందేహాలు ఉన్నట్లయితే 15100 ద్వారా సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ నరహరి నాగమల్లేశ్వరరావు, న్యాయవాది బి.యల్.కోటేశ్వర రావు, పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుభాని, అట్లూరి జ్యోతి ,బాబు రాజేంద్ర జయన్ ప్రసాద్, టి.గోపయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# బహుజనులు తమ సత్తాను చాటాలి..

## -బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి..

## -బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఐతవోని రాఘవేందర్ గౌడ్

అమరావతి, మే 16:బడుగు,బలహీన వర్గాలైన బిసి, ఎస్సి,ఎస్టి మైనారిటీ, అగ్రవర్ణ పేదలు ఐక్యమత్యంతో ఉద్యమిస్తే రెండేళ్లలో బీసీ రాజ్యం రావడం తధ్యమని బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఐతవోని రాఘవేందర్ గౌడ్(రాఘవన్న) పిలుపునిచ్చారు. శనివారం స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు లో బీసీ రాజ్యాధికార వేదిక పాదయాత్ర అట్టహాసంగా కొనసాగింది. వివిధ పార్టీల నాయకులు,యువత, ప్రజలు పాదయాత్ర చేపడుతున్న రాఘవన్నకు తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో 8 వ వార్డు కౌన్సిలర్ పొన్నం రాజేష్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో రాఘవన్న మాట్లాడారు. మన బతుకులు మారాలన్నా, నిరుద్యోగ సమస్య అంతం కావాలన్నా, ప్రభుత్వ విద్యా, వైద్యం మెరుగుపడాలన్నా బీసీ రాజ్యం రావాలని తెలిపారు. 8 దశాబ్దాలుగా మన సమస్యలపై చెప్పులు అరి గేలా తిరిగిన అగ్రవర్ణ పాలకులు పెడచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# మనుమడిని కాపాడబోయి తాత మృతి

నల్గొండ, మే 16: మనుమడిని కాపాడబోయి తాత మృతిచెందిన విషాద సంఘటన మిర్యాలగూడ రూరల్ మండలం యాదగిరిపల్లిలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బోరు బావి పక్కన సుమారు 12 అడుగుల గోయి ఏర్పడింది. గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ నాగబోన నాగమ్మ భర్త వెంకన్న శనివారం ఉదయం తన కూతురు పిల్లలు హేమాన్ష్, లోహితను పొలం వద్దకు తీసుకుని వెళ్లాడు. పనులు చేస్తుండగా మనుమడు హేమాన్ష్ ఆడుకుంటూ బోరు పక్కన ఏర్పడిన గుంతలో పడిపోయాడు.

అది గమనించిన వెంకన్న బాలుడిని పైకి తీసే క్రమంలో తాను జారీ తలక్రిందులుగా గుంతలో ఇరుక్కుపోయాడు. పైకి లేచేందుకు ప్రయత్నిస్తే లేవలేక పోతుండడంతో గమనించిన మనుమరాలు భయపడి సమీపంలో ఉన్న రైతులకు విషయం చెప్పింది. వారు బోరు గుంత వద్దకు వచ్చి వెంకన్నను, పిల్లవాడిని రక్షించే ప్రయత్నం చేశారు. రూరల్ ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఓ యువకుడి సాయంతో ఇద్దరిని గుంత నుండి వెలికితీశారు.

# స్విమ్స్‌లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం

## "కలిసి కట్టుగా అధిక రక్తపోటును నియంత్రిద్దాం" అంటూ వైద్యుల పిలుపు

## జీవనశైలి మార్పులతో బీపీ నియంత్రణ సాధ్యమని అవగాహన

## వ్యాయామం, సమతుల్య ఆహారం, ఉప్పు తగ్గింపు అవసరమని సూచనలు




తిరుపతి, మే 16:తిరుపతి స్విమ్స్ లో శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి ఓపీడి బ్లాక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు రక్తపోటు నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ మాట్లాడుతూ, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ ఆదేశాల మేరకు ఈ ఏడాది "కంట్రోలింగ్ హైపరెటెన్షన్ టుగెదర్" అనే థీమ్‌తో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్, విభాగాధిపతి డా. వనజాక్షమ్మ మాట్లాడుతూ అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడానికి ప్రతిరోజూ యోగా, ధ్యానం చేయాలని సూచించారు. ప్రశాంతమైన మనస్తత్వం, సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం వల్ల బీపీ తగ్గుతుందని తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వరుణ్ రక్తపోటు కారణాలు, లక్షణాలు, గుర్తించే విధానం, నియంత్రణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. డా. ఫర్దీబా మాట్లాడుతూ శారీరక శ్రమ, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండటం ద్వారా అధిక రక్తపోటు ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చున్నారు. డా. వాహిద్ ఖాన్ మాట్లాడుతూ బీపీ నియంత్రణలో ఉంటే స్ట్రోక్, పక్షవాతం వంటి సమస్యలను నివారించవచ్చున్నారు. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం, ఉప్పు తక్కువగా తీసుకోవడం అవసరమని సూచించారు. అధిక బరువు కూడా రక్తపోటుకు కారణమవుతుందని తెలిపారు. డా. అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బీపీ పరీక్షించుకోవాలని, ఇంటి వద్ద బీపీ చూసుకునే విధానాన్ని వివరించారు.

డా. సురేష్ కుమార్ అధిక రక్తపోటు సమయంలో కనిపించే లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం నిర్వహించిన ప్యానెల్ చర్చలో డా. వాహిద్ ఖాన్ మోడరేటర్‌గా వ్యవహరించగా, పేషెంట్లు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రతి ఇంటిలో, ప్రతి గ్రామంలో రక్తపోటు నియంత్రణపై అవగాహన పెంపొందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా ముందుకు సాగాలని వైద్యులు పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం పండ్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. రోహిత్, డా. ఉపేంద్ర, డా. ధర్మసాయి, డా. విష్ణు ప్రసన్న బాబు, డా. విష్ణు వర్ధన్, డా. నరేంద్ర తదితర వైద్యులు పాల్గొన్నారు.

# రోగ నిరోధక శాస్త్ర పితా మహుడు ఎడ్వర్ట్ జెన్నర్

వివిధ వ్యాధులు సోకకుండా కాపాడు కోవడానికి, రోగ నివారణ కోసం వ్యాక్సిన్లు తీసుకోవడం సర్వ సాధారణ మై పోయింది. కుక్కకాటు, క్షయ, కలరా, కామెర్లు, మలేరియా, కేన్సర్ల వంటి వ్యాధులకు పూర్వం సరైన మందులు లేవు. ప్రధానంగా మానవాళి మనుగడకు పెను సవాలుగా నిలిచిన మశూచి వ్యాధి ప్రపంచ మంతా భయంకరంగా వ్యాపించి ఉండేది. ఇంగ్లండ్‌కు చెందిన ఎడ్వర్డ్ జెన్నర్ మహనీయుడు స్మాల్‌ఫాక్స్ వ్యాధి సోకకుండా ఉండటానికి వ్యాధి నిరోధక 'వాక్సినేషన్' మందు కనిపెట్టి మానవాళికి ఎంతో మేలు చేశాడు. వ్యాక్సిన్ అనే పదం 'వాకా' నుంచి వచ్చింది. వాకా అంటే ఆవు అని అర్థం.

స్మాల్‌పాక్స్ (మశూచి) క్రీ.పూ 3వ శతాబ్దం నుంచి మానవ చరిత్రలో ఈ వ్యాధి ప్రస్తావన కనిపిస్తుంది. 18వ శతాబ్ది నాటికి కాలనైజేషన్ కారణంగా ప్రపంచమంతా విస్తరించింది. దీనివల్ల కలిగే మరణాలు భారీగా ఉండేవి. మశూచి అంటువ్యాధి. అయితే, దీనికి వ్యాక్సిన్ కనిపెట్టింది మాత్రం 1796వ సంవత్సరంలోనే బ్రిటన్ కు చెందిన డాక్టర్ ఎడ్వర్డ్ జెన్నర్ మశూచికి వ్యాక్సిన్ కనిపెట్టారు. ఒక వ్యాధికి అడ్డుకట్ట వేయడానికి తయారు చేసిన తొలి వ్యాక్సిన్ ఇదే. దీని వల్లే మశూచి మరణాల సంఖ్య గణనీయంగా తగ్గాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాక్సిన్ అందుబాటు లోకి రావడంతో 1980 నాటికి మశూచి అంతమైనట్లు అప్పటి వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ప్రకటించింది.

జెన్నర్ ఒక ఆంగ్ల వైద్యుడు, మశూచి వ్యాక్సినేషన్ మార్గదర్శకుడు, రోగనిరోధక శాస్త్ర పితామహుడు.

ఎడ్వర్డ్ జెన్నర్ 1749 మే 17న గ్లౌసెస్టర్‌షైర్ లోని బర్కిలీలో జన్మించాడు. 14 సంవత్సరాల వయస్సులో, స్థానిక సర్జన్ వద్ద, తరువాత లండన్‌లో శిక్షణ పొందాడు. 1772లో, అతను బర్కిలీకి తిరిగి వచ్చాడు. అతని కెరీర్‌లో ఎక్కువ భాగం తన స్థానిక పట్టణంలో వైద్యుడిగా గడిపాడు. 1796లో, అతను ఎనిమిదేళ్ల జేమ్స్ ఫిప్స్‌పై ఇప్పుడు



మే 17... ఎడ్వర్డ్ జెన్నర్ జయంతి

ప్రసిద్ధి చెందిన ప్రయోగాన్ని చేశాడు.

జెన్నర్ కౌపాక్స్ స్ఫోటము నుండి తీసిన చీమును బాలుడి చేతిపై ఒక కోతలోకి చొప్పిం చాడు. తన ప్రయోగాన్ని వివరిస్తూ 1797లో రాయల్ సొసైటీకి ఒక పత్రాన్ని సమర్పిం చాడు, జెన్నర్ తన స్వంత 11నెలల కొడుకుతో సహా ఇతర పిల్లలపై ప్రయోగాలు చేశాడు. 1798లో, ఫలితాలు చివరకు ప్రచురించ బడ్డాయి.

మశూచి 16, 17 శతాబ్దంలో కొన్ని లక్షల మంది చావుకు కారణం అయిన వ్యాధి. ఎడ్వర్డ్ జెన్నర్ డాక్టర్ అయ్యాక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేయడం ప్రారంభించాడు. మశూచి బాగా ప్రభలుతున్న కాలంలో డైరీ ఫారం లో పనిచేస్తూ కౌ ఫాక్స్ వ్యాధి వచ్చిన రైతులకు మశూచి సోకడంలేదని ఆయన గమనించాడు.

పశువుల నుంచి మనుషులకు సంక్రమించే కౌఫాక్స్‌తో బాధపడుతున్న ఒక వ్యక్తి అతను పనిచేసే డాక్టర్ దగ్గరకు వచ్చాడు. కౌఫాక్స్ సోకిన వ్యక్తులు స్మాల్‌ఫాక్స్ బారిన పడక పోవడాన్ని ఎడ్వర్డ్ గమనించాడు.

ఈ పరిశీలనే స్మాల్‌ఫాక్స్‌కు వ్యాక్సిన్ తయారుచేసేలా తోడ్పడింది. మొట్టమొదట వ్యాక్సిన్ తయారుచేసిన పరిశోధకుడిగా చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. ఎడ్వర్ట్ జెన్నర్‌కు ఫాదర్ ఆఫ్ ఇమ్యునాలజీ అని పేరుంది.

తన ఫ్రెండ్ అనుమతితో ఆయన కొడుకు అయిన జేమ్స్ మీద 1796 మే 14 న ఒక ప్రయోగం చేసాడు. కౌ ఫాక్స్ సోకిన వ్యక్తి శరీరం మీద వచ్చే బొబ్బ నుంచి వచ్చే స్రావాన్ని జేమ్స్ కి రాసేసి కౌ ఫాక్స్ వచ్చేలా చేశాడు. 6వారాల తర్వాత జేమ్స్ ని మశూచి కి గురిచేయగా, ఎటువంటి మసూచి లక్షణాలు కనిపించలేదు. ఇదే మశూచి వాక్సిన్ కనుగొనడానికి జరిగిన ప్రయత్నం.

వ్యాక్సిన్‌లోని పరిణామాలపై పరిశోధన, సలహాలు ఇవ్వడంలో ఎక్కువ సమయం గడిపాడు. జెన్నర్ అనేక ఇతర రంగాలలో పరిశోధన చేసాడు. శిలాజ సేకరణ, ఉద్యాన వనాలపై కూడా ఆసక్తిని పెంచు కున్నాడు. వ్యాధి నివారణలో మానవాళికి మహోపకారం చేసిన జెన్నర్ 1823 జనవరి 26న మరణించాడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# నార్కోటిక్ జాగిలాలతో విస్తృత తనిఖీలు..

## - గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు




రాజన్న సిరిసిల్ల, మే 16: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా నార్కోటిక్ జాగిలాల సహాయంతో సిరిసిల్ల, తంగళ్లపల్లి ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించింది. జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, బస్టాండ్ పరిసరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా నార్కోటిక్ జాగిలాలతో తరచూ తనిఖీలు చేపడుతూ అక్రమ కార్యకలాపాలపై నిఘా పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే యువత, ప్రజల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా వ్యక్తులు, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు లేదా ఇతర ప్రదేశాల్లో ప్రభుత్వం నిషేధించిన గంజాయి, మత్తు పదార్థాలు నిల్వ ఉంచినా లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100/112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు తెలిపారు.

# మే 19న చైనా వెళ్లనున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

న్యూఢిల్లీ, మే 16:రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్. చైనాలో పర్యటించనున్నారు. మే 19, 20వ తేదీల్లో ఆయన పర్యటన కొనసాగుతుంది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన భేటీ కానున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టూర్ చేసిన కొన్ని రోజుల తేడాలోనే రష్యా అధ్యక్షుడు చైనా ట్రిప్‌కు వెళున్నారు. పుతిన్, జిన్‌పింగ్ ఇద్దరూ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యలపై స్పందించనున్నారు. సంయుక్త డిక్లరేషన్‌పై ఇద్దరు నేతలు సంతకం చేయనున్నారు. ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో ఇద్దరు నేతల భేటీ కీలకం కానున్నది. రష్యా అధ్యక్షుడికి చైనా ఆహ్వానం పంపినట్లు క్రెమ్లిన్ తన ప్రకటనలో తెలిపింది. పుతిన్ తన పర్యటనలో చైనా ప్రధాని లీ క్వియాంగ్‌ను కూడా కలుసుకుంటారు. వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపై చర్చించుకోనున్నారు. గత ఆగస్టులోనే పుతిన్ చైనాలో విజిట్ చేశారు. బీజింగ్‌లో షాంఘై కార్పొరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ జరిగినప్పుడు పుతిన్ వెళ్లారు. ఈ ఏడాది పుతిన్ రెండు సార్లు చైనాలో పర్యటించనున్నారు. నవంబర్‌లో షెన్‌జెన్‌లో జరిగే ఏషియా పసిఫిక్ ఎకనామిక్ కార్పొరేషన్ మీటింగ్‌కు హాజరుకానున్నారు.

# ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర' తప్పనిసరి: మంత్రి కొల్లురవీంద్ర



అమరావతి, మే 16:ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈరోజు (శనివారం) మచిలీపట్నం రైతు బజార్ ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. గ్రామ వార్డు, సచివాలయాల వారీగా ప్రతినెల మూడో శనివారం ఈ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను, ప్రజలకు జరిగే నష్టాలను వివరించాలని.. దీనిపై సమగ్ర అవగాహనతో ముందుకు వెళ్లాలని అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

### ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ అవసరం: కొనకళ్ల నారాయణ

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ.. ఒక్కో బస్సు ధర సుమారు రూ.1.60 కోట్ల నుంచి రూ. 1.70 కోట్ల వరకు ఉందన్నారు. ?ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి బస్సులను కొనుగోలు చేయడం ప్రస్తుతానికి ఆర్టీసీకి, ప్రభుత్వానికి సాధ్యం కాని పనిగా చెప్పుకొచ్చారు. దీనికి బదులుగా బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తే.. వారే పెట్టుబడులు పెట్టి బస్సులను నడుపుతారన్నారు. దీనివల్ల ఆర్టీసీపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు.

రాష్ట్రంలో సుమారు 10 వేల బస్సులు నడుస్తున్నాయని ఆర్టీసీ చైర్మన్ తెలిపారు. వాటన్నింటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలంటే దాదాపు రూ.15 వేల కోట్లు అవసరమని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పెరిగిందన్నారు. ప్రయాణికులకు ఛార్జీలు పెంచే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చు చాలా తక్కువన్నారు. ?ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, నిర్వహణ వ్యయం తగ్గి.. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు. రాబోయే రెండు నెలల్లో ఈ ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి వస్తాయని కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు.

# ఆత్మకూర్‌లో డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ




నల్గొండ, మే 16:జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆత్మకూర్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ రమ్య రెడ్డి మాట్లాడుతూ సమాజంతో మమేకమై -డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశ కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. డెంగ్యూ వైరస్ వ్యాధిని హాని కలిగించే ఎడిస్ ఇజాప్టై (టైగర్) దోమ మన ఇంటి పరిసరాలలో చిన్న చిన్న పాత్రల లో స్థావరం ఏర్పాటు చేసుకొని పగటి పూట కుట్టడం జరుగుతుందని తెలిపారు. వారానికి ఒకసారి ఇంటి పరిసరాల్లో లార్వా (తొక పురుగులు) లేకుండా చేసుకోవాలని, దోమ తెరలు వాడాలని, కిటికీలకు జాలిలు బిగించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి చెరుకు యాదగిరి, సూపర్‌వైజర్ భూతరాజు సైదులు, నర్సింగ్ ఆఫీసర్ మానస, ఫార్మసీ ఆఫీసర్ జానకి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆత్మకూర్.ఎస్‌లో డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

నల్గొండ, మే 16: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆత్మకూర్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. పీహెచసీ వైద్యాధికారి డాక్టర్ రమ్య రెడ్డి మాట్లాడుతూ సమాజంతో మమేకమై -డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశ కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. డెంగ్యూ వైరస్ వ్యాధిని హాని కలిగించే ఎడిస్ ఇజాప్టై (టైగర్) దోమ మన ఇంటి పరిసరాలలో చిన్న చిన్న పాత్రలలో స్థావరం ఏర్పాటు చేసుకొని పగటి పూట కుట్టడం జరుగుతుందని తెలిపారు. వారానికి ఒకసారి ఇంటి పరిసరాల్లో లార్వా (తొక పురుగులు) లేకుండా చేసుకోవాలని, దోమ తెరలు వాడాలని, కిటికీలకు జాలిలు బిగించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి చెరుకు యాదగిరి, సూపర్‌వైజర్ భూతరాజు సైదులు, నర్సింగ్ ఆఫీసర్ మానస, ఫార్మసీ ఆఫీసర్ జానకి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా కళాతపస్వి యెల్ల పోశెట్టి- సరిత వివాహ వార్షికోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, మే 16: (నేటినిజం ప్రతినిధి): కళాతపస్వి యెల్ల పోశెట్టి- సరిత దంపతుల 37వ వివాహ వార్షికోత్సవం, స్నేహ బృందం ఆర్కెస్ట్రా కల్చరల్ అకాడమీ 37వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వేములవాడలో ఘనంగా జరిగాయి. జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య, వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ముందుగా శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా యెల్ల పోశెట్టి మాట్లాడుతూ 1989లో స్నేహ బృందం ఆర్కెస్ట్రా కళా సంస్థను స్థాపించిన మూడు నెలలకే వివాహం జరగడం ఆనందంగా ఉందన్నారు. 1999లో వేములవాడ నృత్య కళా సేవా సంస్థను స్థాపించి ఉచిత నృత్య శిక్షణ తరగతులు నిర్వహించామని, శిక్షణ పొందిన కళాకారులు జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం సంతోషకరమన్నారు. కళా సంస్థ అభివృద్ధికి సహకరించిన దాతలు, డాన్స్ మాస్టర్లు, కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇతర జిల్లాల నుంచి శుభాకాంక్షలు తెలిపిన కళాకారులు, బంధుమిత్రులు, కళాపోషకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా అడిచెర్ల రాజు



కరీంనగర్, మే 16:(నేటనిజం (ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అడిచెర్ల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి తెలంగాణ రాష్ట్ర పార్టీ నియామకపు ఉత్తర్వుల ప్రకటన విడుదల చేసింది. ఓబిసి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అడిచెర్ల రాజు మాట్లాడుతూ తన పై నమ్మకంతో ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కార్యదర్శి ఆఫీస్ బేరర్ గా అవకాశం కల్పించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ , రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి లతోపాటు నా నియామకానికి సహకరించిన కరీంనగర్ జిల్లా రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకులకు మిత్రులు శ్రేయోభిలాషులు కార్యకర్తలకు అందరికీ అడిచెర్ల రాజు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కోసం , ఓబీసీ మోర్చా బలోపేతం కోసం తన వంతు శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

## - గోవుల అక్రమ రవాణా అరికట్టేందుకు 6 చెక్‌పోస్టులు- సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, మే 16:(నేటినిజం ప్రతినిధి) బక్రీద్ పండుగ నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ సీపీ గౌష్ ఆలం తెలిపారు. శనివారం హిందూ మత సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల అక్రమ రవాణా, గోవధకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించబోమని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే 'తెలంగాణ గోవధ నిషేధ, జంతు సంరక్షణ చట్టం-1977' ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పశువుల రవాణాకు వెటర్నరీ వైద్యులు జారీ చేసే 'ఫిట్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్' ధ్రువపత్రాలు తప్పనిసరిగా తనిఖీ చేస్తామన్నారు. అక్రమ రవాణా అరికట్టేందుకు ముగ్ధంపూర్, చింతకుంట, ఆర్నకొండ, తుర్కాసినగర్, రేణికుంట, హుజూరాబాద్ పరకాల క్రాస్‌రోడ్డు వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రెండు వారాల పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్‌రావు, సృజన్‌రెడ్డి, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


# పోస్ట్‌ఆఫీస్ ఆధ్వర్యంలో పిఓఎస్బి ఇన్సూరెన్స్ మేళ



రాజన్న సిరిసిల్ల, మే 16: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని నూకల మర్రి పోస్ట్ ఆఫీస్ అనుబంధ గ్రామమైన నమలిగుండుపల్లి లో పోస్ట్ ఆఫీస్ ఐపి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పిఓఎస్బి ఇన్సూరెన్స్ మేళ నిర్వహించడమైనది ఇట్టి మేళాకు వేములవాడ రూరల్ ఎంపీడీవో శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ వేముల సతీష్ రెడ్డి ఉప సర్పంచ్ వంశీ కృష్ణ వార్డ్ మెంబర్స్ ఎస్పిఎం శ్రీహరి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు వట్టెంలా ఏగుర్ల రాజు ఫాజుల్ నగర్ గౌడుగు శ్రీకాంత్ నూకలమర్రి బీపీఎం గూగులోతు తిరుపతి నాయక్ ఏబీపీఎం పంచిత మారుతి ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటయ్య పంచాయతీ కార్యదర్శి జరీనా ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్ గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆహ్వానం

సంస్కార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రామకృష్ణ మిషన్, వారి సౌజన్యంతో నిర్వహించబడుతున్న సాహిత్య కార్యక్రమం.




శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచన "కటకటా మర్కటా" (బాలల కథల సంపుటి) పుస్తక ఆవిష్కరణ సభ

పుస్తక ఆవిష్కరణ
శ్రీ సుకృతానంద మహారాజ్, రామకృష్ణ మిషన్ తిరుపతి

గౌరవ అతిథి
డాక్టర్ ఎన్. సత్యనారాయణ రాజు, డైరెక్టర్, భారతీయ విద్యాభవన్

విశిష్ట అతిథి
ఆచార్య మధురాంతకం నరేంద్ర, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

ఆత్మీయ అతిథి
డాక్టర్ గంగిశెట్టి శివ కుమార్, కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

పుస్తక సమీక్ష
శ్రీ జి. రమేష్ బాబు, తెలుగు శాఖ, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి.

తేదీ: 18-05-2026, సోమవారం సాయంత్రం 5:30 గంటలకు
వేదిక: వివేకానంద సభాంగణం, రామకృష్ణ మిషన్

| సభానంతరం అల్పాహారం |

ఆహ్వానించువారు:సంస్కార్ రాజేష్, సతీష్ కుమార్, Mobile:7396447960

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,
Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com